# భరోసా కేంద్రాల సమన్వయంతోనే బాధితులకు సత్వర న్యాయం




వాస్తవాలు పలుకు
DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 36 | 17-06-2026 బుధవారం | పేజీలు: 06 | వెల: 3/-

## జీడిమెట్ల పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

పాత రియాక్టర్లు పేలి మంటలు..
దట్టమైన పొగతో ఆందోళన
వసంత కెమికల్స్ సమీపంలోని ఖాళీ స్థలంలో ఘటన
పాత రియాక్టర్లు పేలడంతో ఒక్కసారిగా మంటలు
పరిశ్రమల ప్రాంతమంతా దట్టమైన పొగవ్యాప్తి
భయాందోళనకు గురైన కార్మికులు
వెంటనే బయటకు పరుగులు తీసిన ఉద్యోగులు
ఫైర్‌సిలిండర్లు, నీటితో మంటల నియంత్రణకు యత్నం
కంపెనీ సిబ్బంది అప్రమత్తతతో సహాయక చర్యలు
ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది
మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
ప్రమాదానికి గల కారణాలపై ఆరా



**డిడి9 వార్త, హైదరాబాద్**

జీడిమెట్ల పారిశ్రామికవాడలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వసంత కెమికల్స్ కంపెనీ సమీపంలోని ఖాళీ స్థలంలో నిల్వ ఉంచిన పాత రియాక్టర్లు ఒక్కసారిగా పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. పేలుడు శబ్దాలతో కార్మికులు, స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రియాక్టర్ల నుంచి మంటలు వ్యాపించడంతో పరిశ్రమల ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు భయాందోళనకు గురై వెంటనే బయటకు వచ్చేశారు. పరిస్థితిని గమనించిన కంపెనీ సిబ్బంది ఫైర్ సిలిండర్లు, నీటిని ఉపయోగించి మిగతా 3లో..

# సన్నవడ్ల సాగుపై ప్రత్యేక దృష్టి

వ్యవసాయ శాఖకు పంట దిగుబడులపై పూర్తి అవగాహన ఉండాలి: సీఎం
రైతు వేదికల్లో విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశం
సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరణకు సూచన
బోనస్ వర్తించే 7 రకాల సన్నవడ్ల విత్తనాల పంపిణీ
సబ్సిడీపై విత్తనాలు అందించాలని మార్గనిర్దేశం
వ్యవసాయ శాఖలో ఏఐ వినియోగాన్ని పెంచాలని సూచన
సీడ్ నుంచి ధాన్యం కొనుగోలు వరకు సమన్వయ వ్యవస్థ
యూరియా పంపిణీ కోసం ప్రత్యేక యాప్ ఏర్పాటు ప్రతిపాదన
రామగుండం ఎరువుల ఉత్పత్తి తెలంగాణకే కేటాయించాలని డిమాండ్
ఎరువుల సమస్యపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశానికి సూచన



**డిడి9 వార్త, హైదరాబాద్**

వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలు, సాంకేతికత వినియోగం పెంచుతూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో ధాన్యం దిగుబడులపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రైతు వేదికలను మరింత సమర్థవంతంగా వినియోగిస్తూ రైతులకు అవసరమైన విత్తనాలను అక్కడే అందుబాటులో ఉంచాలని సూచించారు. ముఖ్యంగా సన్నవడ్లు సాగు చేసే రైతుల వివరాలను సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. ప్రభుత్వం బోనస్ అందిస్తున్న ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను రైతులకు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని రేవంత్‌రెడ్డి సూచించారు. వాటిని సబ్సిడీపై రైతులకు అందించాలని మిగతా 2లో..

## గురుకులాల ఆహార సరఫరాపై మాటల యుద్ధం

### మంత్రి పొన్నంకు హరీశ్‌రావు కౌంటర్

గుడ్లు, ఆహార సరఫరాలో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలు
రూ.2 వేల కోట్ల స్కామ్‌కు అనుముల బ్రదర్స్ పాల్పడ్డారన్న మంత్రి
రూ.680 కోట్లకే కొనుగోళ్లు జరిగాయని పొన్నం ప్రభాకర్ వివరణ
స్కామ్ జరిగితే ఆధారాలు చూపాలని మంత్రి సవాల్
టెండర్ల వివరాలపై మంత్రులకే అవగాహన లేదన్న హరీశ్‌రావు
శాఖల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి అని విమర్శ
టెండర్లు ఎంతకు పిలిచారో కూడా తెలియదని వ్యాఖ్యలు
ఎవరు ఎంత లబ్ధి పొందారో మంత్రులకు తెలియదన్న మాజీ మంత్రి
గురుకులాల సరఫరాల అంశం రాజకీయ దుమారం
అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు-ప్రత్యారోపణలు

**డిడి9 వార్త, హైదరాబాద్**

గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, ఆహార పదార్థాల సరఫరా అంశం రాజకీయంగా వేడెక్కింది. ఈ వ్యవహారంలో భారీ అవినీతి జరిగిందంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. గురుకులాలు, స్కూళ్లలో పిల్లలకు అందించే గుడ్లు, ఆహార సరఫరా విషయంలో అనుముల బ్రదర్స్ రూ.2 వేల కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై మిగతా 2లో..




## తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

మెట్రో ప్రాజెక్టును అడ్డుకునే
అవసరం కిషన్‌రెడ్డికి లేదన్న కేంద్ర మంత్రి
కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారమని వ్యాఖ్యలు
కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని స్పష్టం
'సర్' అంశంపై ప్రజలను
గందరగోళానికి గురిచేస్తోందని విమర్శ
బంగ్లాదేశ్ వాసులకు ఓటు హక్కు ఇవ్వాలా అని ప్రశ్న
విదేశీయుల ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ వైఖరిని నిలదీత
తెలంగాణ అభివృద్ధే బీజేపీ లక్ష్యమని స్పష్టీకరణ
మావోయిస్టు భావజాలంతో ఏమీ సాధించలేమన్న బండి
తుపాకీ గొట్టం ద్వారా సమస్యలకు పరిష్కారం లేదని వ్యాఖ్య
మావోయిస్టు ఆలోచనలను
విరమించుకోవాలని యువతకు సూచన



**డిడి9 వార్త, హైదరాబాద్**

తెలంగాణ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ పూర్తిగా కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల విషయంలో బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ఖండించారు.

మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఏమాత్రం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సహకరిస్తుందని మిగతా 2లో..

## సింగరేణిలో మానవ హక్కుల ఉల్లంఘన

### రేవంత్ ప్రభుత్వంపై కవిత నిప్పులు..

కార్మికుల రక్షణ కోసం "బాయిబాట"
సరికొత్త రాజకీయ శక్తిగా టిఆర్ఎస్ ఆవిర్భావం..
సింగరేణి ఆశీస్సులు కావాలంటూ వినతి
మహిళా కార్మికులకు లేని కనీస వసతులు..
పార్లమెంట్‌లో పోరాటం గుర్తుచేసిన కవిత
పాత టెక్నాలజీతో కార్మికుల ప్రాణాలతో చెలగాటం..
కార్మికులకు గాలి, నీరు కరువయ్యాయి
తల్లి కాంగ్రెస్‌తోనే కొట్లాడగా.. పిల్ల కాంగ్రెస్ ఒక లెక్కా?
ఐటీ పేరుతో కార్మికుల సొమ్ము దోపిడీ..
మెడికల్ బోర్డు నిలిపివేత దుర్మార్గం..
2 వేల మంది డిపెండెంట్ ఉద్యోగాల నిరీక్షణ
గోదావరి వ్యాలీ బొగ్గును సింగరేణికే ఇవ్వాలి..
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి




**డిడి9 వార్త, హైదరాబాద్**

సింగరేణి బొగ్గు గని కార్మికుల హక్కులను కాలరాస్తూ, వారికి కనీస వసతులు కల్పించకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ చేపట్టిన "బాయిబాట" కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ పరిధిలోని ఆర్కే7 భూగర్భ గనిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మిగతా 2లో..

## బకాయిలు చెల్లిస్తాం.. చలో హైదరాబాద్ విరమించాలి

తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి చర్చలు
ఆర్‌అండ్‌బీలో రూ.4 వేల కోట్ల
బకాయిలు పెట్టిన గత ప్రభుత్వం
కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని ఆరోపణ
యాదగిరిగుట్ట పనులకు రూ.350 కోట్ల బకాయిలు
ఈనెల 18న చలో హైదరాబాద్‌కు బిల్డర్స్ పిలుపు
సీఎంతో మాట్లాడి బిల్లుల చెల్లింపుపై హామీ ఇచ్చిన మంత్రి
ఆందోళన విరమించాలని బిల్డర్స్‌ను కోరిన ప్రభుత్వం
సాయంత్రం వరకు నిర్ణయం
చెబుతామని అసోసియేషన్ స్పందన
కేటీఆర్, హరీశ్‌రావుపై కోమటిరెడ్డి విమర్శలు
కాంట్రాక్టుల వివరాలు చూస్తే నిజాలు తెలుస్తాయన్న మంత్రి



**డిడి9 వార్త, హైదరాబాద్**

తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిల్డర్ల సమస్యలు, పెండింగ్ బిల్లులు, ప్రభుత్వ చర్యలపై చర్చించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, బిల్డర్స్ అసోసియేషన్‌ను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిందని, ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన మిగతా 2లో..

## అవినీతి తిమింగలంపై ఏసీబీ పంజా

ల్యాండ్ అండ్ సర్వే డీడీ
నరహరి ఇళ్లపై దాడులు
ఏకకాలంలో 13 చోట్ల సోదాలు..
రూ.1.10 కోట్ల నగదు, కిలోల కొద్దీ
బంగారం స్వాధీనం
నరహరి తమ్ముడి ఇంట్లోనూ
గుట్టలుగా దొరికిన ఆస్తులు
ఇళ్లలో లభ్యమైన రూ.1.10 కోట్ల
నగదు.. అధికారులు షాక్
కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు,
ల్యాండ్ డాక్యుమెంట్లు స్వాధీనం
ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో
నరహరి 'కీలక' చక్రం
రంగారెడ్డి జిల్లా ఏడీగా ఉన్న
కాలంలోనే అసలు కథ
అన్నదమ్ములను విడివిడిగా
విచారిస్తున్న ఏసీబీ బృందాలు
అవినీతిపై మరింత కఠినంగా
వ్యవహరిస్తామన్న ఏసీబీ





**డిడి9 వార్త, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అవినీతి తిమింగలాల వేటను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరింత ఉధృతం చేశారు. ల్యాండ్ అండ్ సర్వే విభాగం మల్టీజోన్2 డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కొంకరి నరహరి టార్గెట్‌గా ఏసీబీ భారీ సోదాలు నిర్వహించింది. నరహరి తన అధికారిక పదవిని అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో అధికారులు ఈ దాడులకు మిగతా 2లో..

## తెలంగాణకు భారీ వర్ష సూచన

జూన్ 19 నుంచి వారం పాటు దంచికొట్టనున్న వానలు..
అలర్ట్ అయిన అధికార యంత్రాంగం
సీఎం రేవంత్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపుపై ప్రత్యేక ఫోకస్
కలెక్టర్లకు మంత్రి పొంగులేటి కఠిన ఆదేశాలు
రాష్ట్రంలో ప్రస్తుతం 10 శాతం వర్షపాతం లోటు
మూడు రోజుల్లో రాష్ట్రమంతటా రుతుపవనాల విస్తరణ
ఉత్తర తెలంగాణను వణికిస్తున్న వడగాలులు
హైదరాబాద్ మినహా మిగిలిన జిల్లాల్లో పెరిగిన ఉష్ణోగ్రతలు
ప్రజలకు విజ్ఞప్తి.. అత్యవసర సహాయం కోసం నంబర్లు



**డిడి9 వార్త, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే చల్లని కబురు చెప్పింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాస్త నెమ్మదిగా సాగుతున్న నైరుతి రుతుపవనాలు త్వరలోనే ఊపందుకోనున్నాయని వెల్లడించింది. రాబోయే కొద్ది రోజుల్లో ఇవి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించి, భారీ నుండి అతి భారీ వర్షాలు కురిపించే అవకాశం ఉందని అంచనా వేసింది. ముఖ్యంగా జూన్ 19వ తేదీ నుండి మిగతా 2లో..

## గురుకులాల ఆహార సరఫరాపై మాటల యుద్ధం

మొదటిపేజీ తరువాయి

స్పందించిన హరీశ్‌రావు, ప్రభుత్వం చేసిన కొనుగోళ్లు మొత్తం రూ.680 కోట్ల మేరకే ఉన్నప్పుడు రూ.2 వేల కోట్ల స్కామ్ ఎక్కడ జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. "మేము కొన్నదే రూ.680 కోట్లకు. మరి రూ.2 వేల కోట్ల స్కామ్ ఎక్కడ జరిగిందో చెప్పాలి" అని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన సవాల్‌ను ప్రస్తావించిన హరీశ్‌రావు, అసలు తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా మంత్రులకు తెలియని పరిస్థితి ఉందని విమర్శించారు.

టెండర్లు ఎంత మొత్తానికి పిలిచారు, ఎవరు ఎంత లబ్ధి పొందారు అనే ప్రాథమిక విషయాలపై కూడా మంత్రులు పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్‌లకు అవగాహన లేదని హరీశ్‌రావు ఆరోపించారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.

గురుకులాలు, పాఠశాలల ఆహార సరఫరా వ్యవహారం ప్రస్తుతం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ అంశంపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా, రాష్ట్ర రాజకీయాల్లో ఇది మరో వివాదాస్పద అంశంగా మారింది.

## తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

మొదటిపేజీ తరువాయి



చెప్పారు. అర్థంలేని ఆరోపణలను ప్రజలు నమ్మరని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం కూడా లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తమకు సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించిన ఆయన, 'సర్' అంశంపై కాంగ్రెస్ ప్రజల్లో అనవసర గందరగోళం సృష్టిస్తోందని విమర్శించారు. బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తులకు ఓటు హక్కు ఇవ్వాలా అని ప్రశ్నించిన బండి సంజయ్, ఇతర దేశాలకు చెందిన వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని నిలదీశారు.

**మావోయిస్టులు ఇక లేరు..**

మావోయిస్టుల అంశంపై కూడా బండి సంజయ్ స్పందించారు. చివరకు మావోయిస్టులు సాధించింది ఏమిటని ప్రశ్నించిన ఆయన, తుపాకీ గొట్టం కారణంగా అనేక మంది అమాయకులు, మైనర్లు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హింసా మార్గాన్ని అనుసరించడం వల్ల మావోయిస్టు సంస్థ నిషేధానికి గురయ్యే పరిస్థితి వచ్చిందన్నారు.

తుపాకీ గొట్టం ద్వారా ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం లభించదని మావోయిస్టు అగ్రనేతలు కూడా గుర్తించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తూ పలువురు మావోయిస్టులు ఇప్పటికే లొంగిపోయారని చెప్పారు. ప్రస్తుతం మావోయిస్టులు అనే శక్తి దాదాపు లేకుండాపోయిందని వ్యాఖ్యానించారు.

మావోయిస్టు భావజాలంతో ఏదైనా సాధించాలనే ఆలోచన ఉన్న వారు ఆ మార్గాన్ని విడిచిపెట్టాలని బండి సంజయ్ సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధమైన మార్గాల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని, హింస ద్వారా ఏమీ సాధించలేమని స్పష్టం చేశారు.

## అవినీతి తిమింగలంపై ఏసీబీ పంజా

మొదటిపేజీ తరువాయి

వ్యూహరచన చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ ప్రత్యేక బృందాలు నరహరి నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన వివిధ ప్రాంతాలపై విరుచుకుపడ్డాయి. ఈ ఆకస్మిక తనిఖీలు నగరంలోని ప్రభుత్వ ఉన్నతాధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.కొంకరి నరహరి అవినీతి సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టేందుకు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు ఏకకాలంలో 13 ప్రాంతాలలో సోదాలు ప్రారంభించాయి. నరహరి నివాసముంటున్న ఇల్లే కాకుండా, ఆయన విధులు నిర్వర్తించే కార్యాలయాలు, హైదరాబాద్‌లోని చార్మినార్ పరిసర ప్రాంతాలు, మరియు ఆయనకు అత్యంత ఆప్తులైన బంధువుల ఇళ్లలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. నిందితుడు ఎక్కడా ఆస్తుల పత్రాలను లేదా నగదును మాయం చేయకుండా ఉండేందుకే అత్యంత రహస్యంగా ఒకే సమయంలో అన్ని చోట్లా దాడులు చేసినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి.

ఈ సోదాల పరిధి కేవలం నరహరి వ్యక్తిగత ఆస్తులకే పరిమితం కాలేదు. అవినీతి సొమ్మును బంధువుల పేరిట మళ్లించారనే అనుమానంతో నరహరి తమ్ముడి నివాసంలోనూ ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టారు. అక్కడ కూడా ఊహించని రీతిలో భారీగా అక్రమ ఆస్తులను, విలువైన ల్యాండ్ డాక్యుమెంట్లను అధికారులు గుర్తించారు. నరహరి సంపాదించిన నల్లధనంలో ఎక్కువ భాగం తమ్ముడి వ్యాపారాల్లో లేదా స్థిరాస్తుల రూపంలో పెట్టుబడిగా పెట్టినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో అధికారులు ఆ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.

సోదాల సందర్భంగా కొంకరి నరహరి, ఆయన తమ్ముడి ఇళ్లలో లభించిన నగదును చూసి ఏసీబీ అధికారులే ముక్కున వేలేసుకున్నారు. ఇళ్లలోని లాకర్లు, రహస్య డ్రాయర్ల నుంచి సుమారు 1.10 కోట్ల రూపాయల కరెక్ట్ నోట్ల కట్టలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నగదును ఇంట్లో ఉంచడంపై అన్నదమ్ములిద్దరినీ అధికారులు గట్టిగా నిలదీస్తున్నారు. ఈ నగదు ఎక్కడి నుండి వచ్చింది? ఎవరికి ఇవ్వడానికి లేదా ఎవరి నుండి లంచంగా తీసుకున్నారు? అనే విషయాలపై ఏసీబీ అధికారులు వారి నుంచి రాతపూర్వక వివరణ సేకరిస్తున్నారు.

నగదుతో పాటు భారీ ఎత్తున బంగారు, వెండి ఆభరణాలను కూడా ఏసీబీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. మార్కెట్లో కోట్లాది రూపాయల విలువ చేసే పలు నివాస స్థలాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలకు సంబంధించిన ల్యాండ్ డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఎక్కువ శాతం ఆస్తులు బినామీల పేరిట ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ పత్రాలన్నింటినీ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ శాఖ రికార్డులతో సరిపోల్చడానికి మరియు వాటి అసలు విలువను లెక్కించడానికి లీగల్ నిపుణుల సహాయం తీసుకుంటున్నారు.

కొంకరి నరహరి ప్రస్తుతం ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్‌గా అత్యంత కీలకమైన బాధ్యతల్లో ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వేలు నిర్వహించడం, జిల్లాల వారీగా ఉన్న పెద్ద పెద్ద భూ సరిహద్దు వివాదాలను పరిష్కరించడం, అలాగే ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములను స్వాధీనం (లాండ్ అక్విజిషన్) చేసుకోవడం వంటి పనులన్నీ ఈయన పర్యవేక్షణలోనే జరుగుతుంటాయి. ఈ విభాగంలో ఉండే విపరీతమైన డిమాండ్‌ను నరహరి తన స్వార్థానికి వాడుకుని, భూయజమానులను వేధిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నరహరి గతంలో రంగారెడ్డి జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) గా సుదీర్ఘ కాలం పని చేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉండే రంగారెడ్డి జిల్లాలో భూముల విలువలు ఆకాశాన్ని తాకుతుంటాయన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే నరహరి భూ అక్రమాలకు, నకిలీ సర్వే నివేదికల జారీకి తెరలేపినట్లు ఏసీబీ బలమైన అనుమానాలు వ్యక్తపరుస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం, వివాదాస్పద భూములను సెటిల్ చేయడం ద్వారా ఆయన వందల కోట్లు వెనకేశారనే కోణంలో పాత ఫైళ్లను కూడా ఏసీబీ తిరగేస్తోంది.స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, బ్యాంకు పాస్ బుక్కులు, భారీ నగదుపై నరహరితో పాటు ఆయన సోదరుడిని ఏసీబీ అధికారులు ఒకే చోట కూర్చోబెట్టి, అలాగే విడివిడిగా కూడా విచారిస్తున్నారు. ఇద్దరి స్టేట్‌మెంట్లలో ఏవైనా తేడాలు ఉన్నాయా అని గమనిస్తున్నారు. ఇప్పటి వరకు దొరికిన ఆస్తులు వారి సాధారణ జీతభత్యాల ఆదాయం కంటే వందల రెట్లు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తేల్చారు. విచారణకు నరహరి ఏమాత్రం సహకరించడం లేదని, పొంతన లేని సమాధానాలు చెబుతున్నట్లు సమాచారం.తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఏసీబీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# సన్నవడ్ల సాగుపై ప్రత్యేక దృష్టి

మొదటిపేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్టును మరింత విస్తరించి రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా విస్తరించాలని సీఎం పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని పెంచి వ్యవసాయ నిర్వహణను ఆధునికీకరించాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా ఉపయోగించుకుని పరిశోధన, సాంకేతికత, రైతు సేవల మధ్య సమన్వయం పెంచాలని చెప్పారు.

విత్తనాల సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. మార్క్‌ఫెడ్ ఆర్థిక నష్టాలను తగ్గించే చర్యలు చేపట్టాలని, ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

రాష్ట్రంలో ఎరువుల పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు అన్ని వ్యవసాయ మందులు, ఎరువులకు సంబంధించిన సమాచారంతో ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని సీఎం సూచించారు. రైతులు యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకునే విధానం తీసుకురావాలని, రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు.

యూరియా, ఇతర ఎరువుల కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని, అవసరమైతే తరచూ లేఖలు రాయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే ఎరువులను పూర్తిస్థాయిలో తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

ఎరువుల లభ్యత, కేటాయింపుల అంశంపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సింగరేణిలో మానవ హక్కుల ఉల్లంఘన

మొదటిపేజీ తరువాయి

కవిత మాట్లాడారు. నల్లబంగారాన్ని వెలికితీస్తూ దేశానికి వెలుగులు పంచుతున్న సింగరేణి కార్మికుల పొట్టగొట్టేలా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయని, కార్మికుల కనీస అవసరాలను తీర్చని పక్షంలో తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల పక్షాన టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ కార్మిక సంఘాలు నిరంతరం పోరాడుతాయని ఆమె స్పష్టం చేశారు.

**సరికొత్త రాజకీయ శక్తిగా టిఆర్ఎస్ ఆవిర్భావం.. సింగరేణి ఆశీస్సులు కావాలి**

రాష్ట్రంలో కార్మికులు, అణగారిన వర్గాల గొంతుకగా తాము సరికొత్త రాజకీయ శక్తిగా ఆవిర్భవించామని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి, ఆ తర్వాత బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా తాను కార్మికుల సంక్షేమం కోసమే పనిచేశానని గుర్తుచేశారు. కొన్ని అనివార్య కారణాలు మరియు సరికొత్త రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తాను కొత్త పార్టీని స్థాపించాల్సి వచ్చిందని వివరించారు. సింగరేణి కార్మికుల నిజమైన సమస్యలపై పోరాడేందుకే తాము "బాయిబాట" పట్టి మీ ముందుకు వచ్చామని, తమ సరికొత్త ప్రయాణానికి సింగరేణి కార్మికుల ఆశీర్వాదం, మద్దతు ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

**మహిళా కార్మికులకు లేని కనీస వసతులు.. పార్లమెంట్‌లో పోరాటం గుర్తుచేసిన కవిత**

గనుల సందర్శనలో తనకు మహిళా సూపర్‌వైజర్లు, ఉద్యోగులు ఎదురవడంపై కవిత సంతోషం వ్యక్తం చేశారు. సింగరేణి గనుల్లో మహిళలకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆనాడు తాము పార్లమెంట్‌లో గట్టిగా పోరాడామని, దాని ఫలితంగానే నేడు ఇక్కడ మహిళా ఉద్యోగులను చూడగలుగుతున్నామని పేర్కొన్నారు. అయితే, సింగరేణి చరిత్రలో ఇప్పుడిప్పుడే వస్తున్న మహిళా కార్మికులకు గనుల వద్ద కనీస మౌలిక వసతులు, ప్రత్యేక రక్షణ సౌకర్యాలు లేకపోవడం అత్యంత విచారకరమన్నారు. యాజమాన్యం తక్షణమే స్పందించి మహిళా సిబ్బందికి తగిన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

**పాత టెక్నాలజీతో కార్మికుల ప్రాణాలతో చెలగాటం.. గాలి, నీరు కరువయ్యాయి**

ప్రపంచవ్యాప్తంగా మైనింగ్ రంగంలో అత్యాధునిక సాంకేతికతను వాడుతుంటే, సింగరేణిలో మాత్రం ఇంకా పాత కాలపు పద్ధతులనే వాడుతూ కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని కవిత మండిపడ్డారు. భూగర్భ గనిలోకి వెళ్లే కార్మికులకు కనీసం తాగడానికి స్వచ్ఛమైన మంచి నీరు, పీల్చడానికి సరిపడా గాలి కూడా అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస ప్రాథమిక హక్కులైన గాలి, నీరు అందించకపోవడం యాజమాన్యం సిగ్గుపడాల్సిన విషయమని, ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పర్యటనను అడ్డుకోవాలని చూసిన అధికారులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

**తల్లి కాంగ్రెస్‌తోనే కొట్లాడాం.. పిల్ల కాంగ్రెస్ ఒక లెక్కా?**

నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గనుల వద్దకు వచ్చి కార్మిక సంఘాల సమావేశాలు పెట్టలేదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవిత నిలదీశారు. గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఇక్కడికి వచ్చి మీటింగ్‌లు పెట్టారని గుర్తుచేశారు. కార్మికులను కలిసి వారి బాధలు తెలుసుకుంటేనే కదా చట్టాలు తీసుకురావడానికి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. "తెలంగాణను అడ్డుకున్న తల్లి కాంగ్రెస్‌తోనే ప్రాణాలకు తెగించి కొట్లాడి మనం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నాం. అలాంటిది ఇప్పుడు అధికారంలో ఉన్న ఈ పిల్ల కాంగ్రెస్ ప్రభుత్వంతో కార్మికుల హక్కుల కోసం కొట్లాడటం మాకు పెద్ద లెక్క కాదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ఐటీ పేరుతో కార్మికుల సొమ్ము దోపిడీ.. అధికారుల వేధింపులపై కేసులు**

సింగరేణిలో ప్రస్తుతం విద్యావంతులైన యువ కార్మికులు ఎక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారని, అయితే వారి కష్టార్జితాన్ని ఐటీ (ఆదాయపు పన్ను) రూపంలో ప్రభుత్వం దోచేస్తోందని కవిత ఆరోపించారు. ఏడాదిలో దాదాపు రెండు నెలల జీతం పన్నుల రూపంలోనే పోతుంటే, కార్మికులు తమ పిల్లలను మంచి స్కూళ్లలో ఎలా చదివించుకోగలరని ప్రశ్నించారు. ఉన్నతాధికారులకు, కాంట్రాక్టర్లకు కావాల్సిన అన్ని విలాసవంతమైన సదుపాయాలు కల్పించడానికి నిధులు ఉంటాయి కానీ, రాత్రింబగళ్లు కష్టపడే కార్మికుల పిల్లల కోసం మంచి కార్పొరేట్ పాఠశాలలు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని నిలదీశారు. కార్మికులను ఇబ్బంది పెట్టే అధికారులపై చట్టపరమైన కేసులు పెడతామని హెచ్చరించారు.

**మెడికల్ బోర్డు నిలిపివేత దుర్మార్గం.. 2 వేల మంది డిపెండెంట్ ఉద్యోగాల నిరీక్షణ**

కార్మికుల మెడికల్ అన్‌ఫిట్, డిపెండెంట్ ఉద్యోగాల (కారుణ్య నియామకాలు) విషయంలో ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని కవిత ఆరోపించారు. అనారోగ్యంతో బాధపడుతూ, గనిలోకి వెళ్లలేని స్థితిలో ఉన్న సీనియర్ కార్మికులను అన్‌ఫిట్ చేయకుండా అధికారులు వేధిస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు సమావేశం నిర్వహించాల్సి ఉండగా, ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వచ్చి కేవలం 350 మందికి మాత్రమే నియామక పత్రాలు ఇచ్చారని, కానీ ఇంకా 2 వేల మంది యువకులు ఉద్యోగాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారని, వారి భవిష్యత్తుతో ఆడుకోవద్దని హెచ్చరించారు.

## తెలంగాణకు భారీ వర్ష సూచన

మొదటిపేజీ తరువాయి

ఒక వారం రోజుల పాటు తెలంగాణలోని చాలా జిల్లాల్లో అత్యంత తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. ఈ వర్ష సూచనతో అటు రైతాంగంలో హర్షం వ్యక్తమవుతుండగా, ఇటు ప్రభుత్వం ముందస్తు రక్షణ చర్యలపై దృష్టి సారించింది.

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం**

రాష్ట్రానికి భారీ వర్షాల ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తుగా అప్రమత్తం కావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా అన్ని శాఖలను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

**లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపుపై ప్రత్యేక ఫోకస్**

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జరిపిన సమీక్షలో ప్రధానంగా వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్న ప్రాంతాలపై చర్చించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు నదీ తీర ప్రాంతాలు, చెరువుల కింద ఉన్న లోతట్టు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని, అలాంటి వారిని గుర్తించి ముందే సురక్షిత ప్రాంతాలకు లేదా ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. విపత్తు నిర్వహణ బృందాలను కూడా ఎక్కడికక్కడ అందుబాటులో ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు.

**కలెక్టర్లకు మంత్రి పొంగులేటి కఠిన ఆదేశాలు**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు 24 గంటలూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ శాఖ జారీ చేసే రోజువారీ హెచ్చరికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తగిన రక్షణ నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

**రాష్ట్రంలో ప్రస్తుతం 10 శాతం వర్షపాతం లోటు**

రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వచ్చిన తర్వాత కూడా అవి మందగమనం (నెమ్మదిగా) సాగడం వల్ల తెలంగాణలో ప్రస్తుతం సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు నమోదైనట్లు వాతావరణ శాఖ రికార్డులు చెబుతున్నాయి. అయినప్పటికీ, గడిచిన కొన్ని రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు నుండి మధ్యస్థ రకపు వర్షాలు కురిశాయి. ఈ లోటు వర్షపాతం రాబోయే రోజుల్లో కురిసే భారీ వానలతో పూర్తిగా భర్తీ అవుతుందని, భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

**మూడు రోజుల్లో రాష్ట్రమంతటా రుతుపవనాల విస్తరణ**

ప్రస్తుతం బలాన్ని పుంజుకుంటున్న నైరుతి రుతుపవనాలు రానున్న మూడు, నాలుగు రోజుల్లో తెలంగాణలోని అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తాయని వాతావరణ కేంద్రం డైరెక్టర్ తెలిపారు. ఈ విస్తరణ పూర్తయిన వెంటనే, అంటే జూన్ 19 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జోరుగా, ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఆయా రోజుల్లో ప్రజల భద్రతను ప్రధాన లక్ష్యంగా చేసుకుని మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఉత్తర తెలంగాణను వణికిస్తున్న వడగాలులు**

ఒకవైపు వర్షాల ముప్పు పొంచి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో ఎండల తీవ్రత ఇంకా తగ్గలేదు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఖమ్మం తదితర జిల్లాల్లో వడగాలులు మరియు అధిక ఉష్ణోగ్రతలు జనాలను వణికిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం సాధారణం కంటే 4 నుండి 5 డిగ్రీల వరకు ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, పగటిపూట ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని వాతావరణ శాఖ పేర్కొంది.

**హైదరాబాద్ మినహా మిగిలిన జిల్లాల్లో పెరిగిన ఉష్ణోగ్రతలు**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మరియు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో వాతావరణం కాస్త చల్లబడినప్పటికీ, మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు మళ్ళీ సాధారణం కంటే 3 డిగ్రీల వరకు పెరిగాయి. నేడు కూడా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎండల తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం పూట ముసలివారు, చిన్న పిల్లలు ఇళ్లలోనే ఉండాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు.

**ప్రజలకు విజ్ఞప్తి.. అత్యవసర సహాయం కోసం నంబర్లు**

రాబోయే భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు కూడా స్వచ్ఛందంగా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. టీవీలు, రేడియోలు, వార్తాపత్రికల ద్వారా వచ్చే అధికారిక వాతావరణ హెచ్చరికలను గమనించాలని కోరింది. వర్షాలు ఉధృతంగా కురిసే సమయంలో అనవసరంగా బయటకు రావద్దని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, నదీ తీరాలు, పాతబడిన భవనాల్లో ఉండేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే లేదా వరద సహాయక చర్యల కోసం స్థానిక మండల, జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ అధికారులను సంప్రదించాలని అధికారులు సలహా ఇచ్చారు.

## బకాయిలు చెల్లిస్తాం.. చలో హైదరాబాద్ విరమించాలి

మొదటిపేజీ తరువాయి

'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విరమించుకోవాలని కోరినట్లు తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్అండ్‌బీ శాఖలో సుమారు రూ.4 వేల కోట్ల బకాయిలు మిగిల్చిందని మంత్రి ఆరోపించారు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వెళ్లిపోయిందని విమర్శించారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులపై గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే ఆ పనులకు సంబంధించిన సుమారు రూ.350 కోట్ల బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉంచారని పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ఈనెల 18న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చిందని మంత్రి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి బకాయిల చెల్లింపులపై హామీ ఇచ్చామని, అందువల్ల ఆందోళనను విరమించాలని కోరినట్లు చెప్పారు. దీనిపై అసోసియేషన్ ప్రతినిధులు ఈరోజు సాయంత్రం వరకు చర్చించి తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపారని అన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. పత్రికల్లో ప్రచారం కోసం తమ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బట్ట కాల్చి మీద వేస్తే కాలిపోతామని అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

కాంట్రాక్టుల కేటాయింపుల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. తాము ఎంత మొత్తానికి కాంట్రాక్టులు ఇచ్చామో పరిశీలిస్తే హరీశ్‌రావు తన వ్యాఖ్యలు పొరపాటుగా చేసినట్లు ఒప్పుకుంటారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు.



# భరోసా కేంద్రాల సమన్వయంతోనే బాధితులకు సత్వర న్యాయం

- **అదనపు డీసీపీ ఎన్.శుభం ప్రకాష్**

**నిజామాబాద్ జిల్లా, జూన్ 16(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ సూచించారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 'భరోసా' సెంటర్ ఆధ్వర్యంలో న్యాయ, ఆరోగ్య, చైల్డ్ వెల్ఫేర్ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ... మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని బాధితులకు ఒకే వేదికపై న్యాయ, వైద్య, కౌన్సెలింగ్ సేవలు అందేలా భరోసా సెంటర్ కృషి చేస్తోందని పేర్కొన్నారు. బాధిత మహిళలు, చిన్నారులు మానసికంగా, శారీరకంగా కోలుకునేందుకు అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని, కేసుల విచారణలో సున్నితత్వాన్ని పాటిస్తూ బాధితులకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. బాధితులకు నాణ్యమైన సేవలు అందించడంలో శాఖల మధ్య సమాచార మార్పిడి, సమన్వయం కీలకమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి సమన్వయ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీసీఆర్‌బీ సీఐ పాండేరావు, ఎస్సై వరప్రసాద్ రెడ్డి, పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ పీపీజీ నరసింహారెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేదార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు శోభారాణి, జిల్లా ప్రొబేషనరీ ఆఫీసర్ పవన్ కళ్యాణ్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ జ్యోత్స్న, డీఎం అండ్ హెచ్‌ఓ ప్రతినిధి డాక్టర్ వెంకటేష్, డీసీపీఓ





చైతన్య, భరోసా సెంటర్ ఇన్‌చార్జ్ మహిళా ఎస్సై పుష్పావతి, రోజా, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# జీడిమెట్ల పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి

మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కొంతసేపు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.అగ్నిప్రమాదం కారణంగా కొంతసేపు పారిశ్రామికవాడలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు.



# అద్మాపూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం

**బోధన్, నిజామాబాద్ జిల్లా,జూన్ 16(డీడీ9 వార్త) :**

ప్రభుత్వ ఆదేశాల మేరకు బోధన్ మండలంలోని అద్మాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్నలు హాజరై చిన్నారులకు అక్షరాలు దిద్దింపజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభ్యాసానికి పునాది అక్షరాభ్యాసమని, తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోరెడ్డి గంగాధర్, ఉపసర్పంచ్




రూమ్మాజీ, డీసీసీ జనరల్ సెక్రెటరీ బోర్ర పల్లన్న, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఎడపల్లిలో నకిలీ పట్టాల సృష్టిపై అధికారులకు సర్పంచ్ ఫిర్యాదు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 16(డీడీ9 వార్త) :**

ఎడపల్లి గ్రామ శివారులోని విలువైన భూములను కబ్జా చేసేందుకు అక్రమార్కులు పన్నిన కుట్ర వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్లు 597, 598, 599లలోని సుమారు 17 ఎకరాలకు పైగా భూమిని రెవెన్యూ అధికారుల అండదండలతో ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు తప్పుడు పట్టా పాసు పుస్తకాలను సృష్టించారు. ఈ అక్రమ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్, మంగళవారం ఎంఆర్ఓ కార్యాలయంలో అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంచందర్ మాట్లాడుతూ.. .ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడం దారుణమని మండిపడ్డారు. అక్రమంగా సృష్టించిన పట్టా పాసు పుస్తకాలను వెంటనే రద్దు చేయాలని, ఈ కుంభకోణానికి బాధ్యులైన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు మల్లెపుల శ్రీనివాస్, బర్దీపూర్ విఠల్, నాయిని లక్ష్మణ్ గౌడ్ తదితరులతో కలిసి సర్పంచ్ ఈ ఫిర్యాదు చేశారు. అధికారులు వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతోనే ఈ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారంపై స్థానికంగా సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.



# ప్రభుత్వ పాఠశాల లో పాఠ్య పుస్తకాలు పంపిణీ

**నిజామాబాద్ కోటగిరి/జూన్ 16/(డీడీ9 వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లోని ఎత్తోండ గ్రామం లో ఉర్దూ మీడియం MP UPS పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మరియు నోట్ బుక్స్ పంపిణీ చేసిన ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ వేసవి సెలవులు ముగియడంతో సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టెక్స్‌ట్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం ఎత్తొండ గ్రామం లో ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ గారు విద్యార్థులకు టెక్స్‌ట్ బుక్స్, నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. పాఠశాలలు ప్రారంభమైన రెండు వరోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించడం ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నదని ఆమె పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువస్తూ, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. మొదటి రోజునే పుస్తకాల పంపిణీ జరగడం విద్యా వ్యవస్థలో ఒక మంచి ప్రారంభానికి సంకేతమని అన్నారు

.తమ విలువైన కార్యక్రమాల నుండి సమయాన్ని కేటాయించి ఈ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులను ప్రోత్సహించినందుకు గ్రామ సర్పంచ్ శ్వేతా మేడం గారికి మేము హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మన పిల్లలకు ప్రయోజనకరమైన జ్ఞానాన్ని ప్రసాదించి, వారిని దేశానికి ఉత్తమ సంపదగా తీర్చిదిద్దాలని మేము ప్రార్థిస్తున్నాము. MP UPSస్టాఫ్ ఈ కార్యక్రమంలో తదితరులు ,పాల్గొన్నారు

# బోధన్‌లో మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 16(డీడీ9 వార్త) :**





సమాజంలోని అణగారిన వర్గాల గొంతుకై, దోపిడీ వ్యవస్థపై అక్షరాయుధాన్ని సంధించిన శ్రామిక వర్గ పక్షపాతి, మహాకవి శ్రీశ్రీకి బోధన్ పట్టణంలో ఘన నివాళి లభించింది. పట్టణంలోని తాలూకా రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కవి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.గంగాధర్ మాట్లాడుతూ... సామాజిక వాస్తవాలకు అక్షర రూపం ఇచ్చిన ఘనత శ్రీశ్రీదేనని కొనియాడారు. లంచగొండులు, స్వార్థపరులు, తోటి మనిషి శ్రమను దోచుకునే దుర్మార్గులకు శ్రీశ్రీ రచనలు సింహస్వప్నంగా మారాయని ఆయన గుర్తుచేశారు. పీడిత, తాడిత వర్గాలకు అండగా నిలుస్తూ దోపిడీ దౌర్జన్యాలపై ఆయన విసిరిన సవాల్ నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గుప్పెడు అక్షరాలతో అనంతమైన భావాలను పండించడంలోనూ కన్నీటిని ఉప్పెనగా మార్చి నిస్సహాయులను పోరాట యోధులుగా తీర్చిదిద్దడంలోనూ శ్రీశ్రీ సాహిత్యానికి ఉన్న శక్తి అనన్య సామాన్యమని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పి. శంకర్, బి. సాయిలు, దేవయ్య, రమేష్, లాలయ్య, గంగాధర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# మారుతి మందిరంలో ప్రధాని మోదీ పేరుతో ప్రత్యేక పూజలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 16(డీడీ9 వార్త) :**

దేశ ప్రధాని నరేంద్ర మోదీ భారత చరిత్రలో అత్యధిక రోజులు పరిపాలించిన ప్రధానిగా రికార్డు సృష్టించిన సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ బోధన్ పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరంలో బీజేపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ప్రవీణ్ మహారాజ్ వేద మంత్రోచ్చరణల నడుమ ప్రధాని మోదీ పేరు మీద ఈ పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ఈ సందర్భంగా బీజేపీ బోధన్ పట్టణ అధ్యక్షులు పసుపులేటి గోపి కిషన్ మాట్లాడుతూ... మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించి, మూడోసారి భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఘనత మోదీకే దక్కిందని కొనియాడారు. వ్యవసాయ, ఆర్థిక, రక్షణ, రవాణా రంగాల్లో దేశాన్ని ప్రపంచ దేశాలతో సమానంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన ప్రశంసించారు. విశ్వకర్మ యోజన, ముద్ర లోన్స్, ప్రధాని ఆవాస్ యోజన, పీఎం కిసాన్, బేటీ బచావోబేటీ పడావో వంటి పథకాల ద్వారా సామాన్య ప్రజల ఆర్థికాభివృద్ధికి మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని 370 ఆర్టికల్, అయోధ్య రామమందిర నిర్మాణం, త్రిపుల్ తలాక్ రద్దు వంటి కీలక అంశాలను పూర్తి చేయడంతో పాటు ఉగ్రవాదం మరియు సరిహద్దు సమస్యల పరిష్కారంలో మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని గోపి కిషన్ కొనియాడారు. సెలవు లేకుండా నిరంతరం అవినీతి రహిత పాలనను అందిస్తున్న ప్రధాని మోదీ లాంటి వ్యక్తి మనకు దొరకడం భారత ప్రజల అదృష్టమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొలిపాక బాలరాజు, మాసిని వినోద్, హనుమాన్లుచారి, గుంత గంగాధర్, పేరుక వెంకటేష్, స్వప్నిల్, శ్రీను, వినోద్, వినయ్, పడాల శ్రీను, కిరణ్, పవన్ కళ్యాణ్, శ్రీకాంత్, రాజు, సన్నీ, కనీగంటి ఫణీంద్ర, రాము తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బోధన్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై ఆహార భద్రతాధికారుల దాడులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 16(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలో ఆహార భద్రతా అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు కలకలం రేపాయి. పట్టణంలోని పలు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, రెస్టారెంట్లలో కనీస ప్రమాణాలు పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైనం అధికారుల తనిఖీల్లో బయటపడింది. కొన్ని కేంద్రాల్లో అయితే సింథటిక్ ఆహార రంగులు, టేస్టింగ్ సాల్ట్ (ఎంఎస్‌జీ) నిబంధనలకు విరుద్ధంగా వాడుతున్నట్లు గుర్తించారు. రిఫ్రిజిరేటర్లలో రోజుల తరబడి నిల్వ ఉంచిన పాచిపోయిన ఆహార పదార్థాలను చూసి అధికారులు విస్తుపోయారు. ఇక పరిశుభ్రత లోపాలను తీవ్రంగా పరిగణించిన అధికారులు, నిబంధనలను ఉల్లంఘించిన నిర్వాహకులకు మెరుగుదల నోటీసులు జారీ చేశారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం2006 ప్రకారం అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు



తీసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కచ్చితంగా పరిశుభ్రత ప్రమాణాలు పాటించి, ప్రజలకు సురక్షితమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని వ్యాపారులకు అధికారులు గట్టిగా సూచించారు. అధికారులు జరిపిన ఈ మెరుపు దాడులతో పట్టణంలోని ఫాస్ట్

# ముస్లిం సోదరుడి కుమార్తె వివాహానికి అండగా నిలిచిన డాక్టర్ రమేష్ యువత

**పోతంగల్, జూన్ 16 (డీడీ9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్ గ్రామానికి చెందిన ముస్లిం సోదరుడు షేక్ మౌలానా తన కుమార్తె వివాహం కోసం ఆర్థిక సహాయం అందించాలని సామాజిక సేవకుడు డాక్టర్ సీతాలే రమేష్‌ను కోరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో ఆయన చేసిన విజ్ఞప్తికి స్పందించిన డాక్టర్ రమేష్‌తో పాటు యువకులు మానవత్వాన్ని చాటుతూ సహాయహస్తం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతాలే రమేష్, పంచారెడ్డి అనిల్, మర్కెల్లీ సంతోష్ పటేల్, సూదం నవీన్,సత్యనారాయణ సార్, శ్రావణ్ సార్, శ్రీనివాస్ (హెగ్డోలి) కలిసి షేక్ మౌలానా కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రూ.2,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మతం మనుషులను వేరు చేయదు.. మనసులు కలిపితే అదే మానవత్వం అని పేర్కొన్నారు. ఈ చిన్న సహాయం ఒక కుటుంబానికి అండగా నిలవడమే కాకుండా, సమాజంలో ఐకమత్యం, పరస్పర గౌరవం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. అందరం కలిసి ఉంటే సమాజం మరింత బలపడుతుంది. ఇదే నిజమైన భారతీయ సంస్కృతి, ఇదే మానవత్వం అని డాక్టర్ రమేష్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.





# భీమ్‌గల్‌లో ఊర పండుగకు రంగం సిద్ధం

**నిజామాబాద్ జిల్లా, జూన్ 16(డీడీ9 వార్త) :**

భీమ్‌గల్ పట్టణంలో గ్రామదేవతల ఆశీస్సులతో జరగనున్న 'ఊర పండుగ'కు రంగం సిద్ధమైంది. పట్టణ క్షేమం, ప్రజల సుఖశాంతులను కాంక్షిస్తూ సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జూలై 5 నుంచి ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, పోలేరమ్మ, ముత్యాలమ్మల పండుగ వేడుకలు జూలై 5న 'ముడుపు వేయడం'తో ప్రారంభమవుతాయి. జూలై 9న 'ఆరె ఎత్తడం', జూలై 12న ప్రధాన ఘట్టమైన 'ఊర పండుగ'ను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. మరుసటి రోజు జూలై 13న గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ వేడుకల్లో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కమిటీ అధ్యక్షుడు పతాని కృష్ణ, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.

# నేరరహిత సమాజమే లక్ష్యం : ఎస్సై రాజా శేఖర్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 16(డీడీ9 వార్త) :**

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో 'మన ఊరు మన భద్రత.. మన బాధ్యత' కార్యక్రమం మంగళవారం బోధన్ మండలం ఊట్ పల్లి గ్రామంలో నిర్వహించారు. నేటి కాలంలో ఎదురవుతున్న పలు సవాళ్లు, నేరాల నివారణపై బోధన్ రూరల్ ఎస్సై రాజా శేఖర్ ప్రజలకు దిశానిర్దేశం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం, బ్యాంక్ ఖాతా వివరాలు పంచుకోవడం వంటి పనులు చేయరాదని హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల యువత జీవితాలు నాశనమవ్వడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని, అవి నిరంతరం నిఘా నేత్రాలుగా ఉండి రక్షణ కల్పిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సుంకినిలో బీరప్ప మందిరం, విగ్రహ ప్రతిష్ఠాపనకు ఘన ఏర్పాట్లు

**పోతంగల్, జూన్ 16 (డిడి9 వార్త):**



పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బీరప్ప మందిరం మరియు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల శంకర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి హాజరుకానున్నారు.ఈ సందర్భంగా పోతంగల్, కోటగిరి ఉమ్మడి మండలాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు,అధికారులు, పాత్రికేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పుప్పాల శంకర్ విజ్ఞప్తి చేశారు.

# జలగలంచవద్ద ఘోరరోడ్డు ప్రమాదం,,,!!

- **భైకు అదుపు తప్పిబోల్తాపడె ,**
- **ఎదురుగ వచ్చె ఇసుకలారీని**
- **తప్పించబోయి ప్రమాదం,,,**
- **బీరెల్లికి చెందిన ముగ్గురు పస్ర నుంచి తాడ్వాయికి,,,**
- **అంబులేన్స్ లొ ఆసుపత్రికి తరలించె,,,,**
- **ప్రాణాలతొ బయటపడిన రోడ్డుప్రమాదం,,,**

**ఏటూరునాగారం క్రైం,డి డి 9 వార్త జూన్ 16,**



పస్రనుంచి తాడ్వాయి మద్యలొ జరిగిన రోడ్డుప్రమాదంలొ ముగ్గురు గాయపడ్డారు, మంలంలోని బీరొల్లికి చెందిన ఈ ముగ్గురు భైకుపై బయలు దేరి పస్రాకు వెల్లారు పనులు ముగించుకుని మద్యాహ్నం తిరిగి వస్తున్నారు ఏటూరునాగారం వైపునుంచి ఇసుకలారీలు హన్మకొండకు వెల్లుతున్నాయి జలగలంచ వాగువద్దకు రాగానె పస్రా వైపునుంచి భైకుపై ముగ్గురు వస్తున్నారు, ఎదురుగ ఇసుకలారీవస్తుంది ఆధార్ని తప్పించలోయి అదుపు తప్పికిందపడింది డ్రైవింగు చేస్తున్నయువకుడు నేలకు ఇసురికొట్టినట్లు ఎల్లకిందుల పడ్డాడు స్రుహకోల్లోయడు మిగతా ఇద్దరు కొంచెందూరంగ పడ్డారు వారికి స్వల్పంగ గాయలయ్యాయి తీవ్రంగా గాయ పడిన వ్యక్తిని ప్రయణికులు అంబులేన్స్ కు సమాచారం తెలపగా ఆసుపత్రికి తీసుకెల్లారు, ఇసుకలారీలు అతీ వేగంతొ నడవడం మూలంగ రోడ్డుప్రమాదాలు తరచు జలగలంచ వద్దనె చోటుచేసుకుంటున్నాయి అనిప్రయణికులు ఆరోపిస్తున్నారు,జిల్లాపాల నా అధికారులు,మండల అధికారులు గాని పోలీసు అధికారులు గాని ఇసుకలారీలను అదుపుచేయక పోవడం ఎంతవరకు సమంజస మనిఅంటున్నారు

# కార్పొరేషన్‌లో పైలట్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలి

- **ర్యాగ్ పిక్కర్లను శానిటేషన్ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి ఉపాధి భద్రత కల్పించాలి**
- **26 ఏళ్లుగా సేవలందిస్తున్న కార్మికుల ఉపాధికి ముప్పు**
- **కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదన్న ఏఐటీయూసీ నాయకుడు ఎం.ఎ. గౌస్**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 16 (డిడి9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్తగా ప్రవేశపెడుతున్న పైలట్ ఏజెన్సీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, ర్యాగ్ పిక్కర్లను శానిటేషన్ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి వారికి ఉపాధి భద్రత కల్పించాలని తెలంగాణ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రామగుండం కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గౌస్ డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన ర్యాగ్ పిక్కర్ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేయర్, కమిషనర్‌లకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

కార్పొరేషన్‌లో ప్రవేశపెడుతున్న పైలట్ ఏజెన్సీ విధానం వల్ల గత 26 సంవత్సరాలుగా రిక్షా కార్మికులు, ర్యాగ్ పిక్కర్లుగా సేవలందిస్తున్న వందలాది మంది కార్మికుల ఉపాధి భద్రత ప్రమాదంలో పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని అధికారికంగా శానిటేషన్ ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించి తగిన జీతభత్యాలు, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని కోరారు.ఇంటింటి చెత్త సేకరణ చేసే కార్మికుల జీవన పరిస్థితులను వివరిస్తూ, గతంలో కేవలం రూ.150 జీతంతో ప్రారంభమైన వారి ఉపాధి ప్రస్తుతం రూ.4 వేల మ్యాచింగ్ గ్రాంట్‌తో పాటు ఇంటి యజమానుల నుంచి



సేకరించే నెలవారీ పారితోషికంపై ఆధారపడి కొనసాగుతోందన్నారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు 140 మందికి పైగా కార్మికులు ఈ రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్మికుల్లో అనారోగ్య సమస్యల కారణంగా 20 నుంచి 25 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, మరికొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల సేవలను గుర్తించి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత పాలకవర్గం, మేయర్, స్థానిక ఎమ్మెల్యేపై ఉందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ పోరాటానికి అన్ని కార్మిక, ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ర్యాగ్ పిక్కర్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతతోనే ఆర్థిక భద్రత

**జనగామ జూన్ 16(డిడి 9వార్త ) బ్యూరో**

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి: RBI AGM హేమలత ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ హేమలత సూచించారు. రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలో జనగామ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, సేవింగ్స్ ఖాతాలు తదితర బ్యాంకింగ్ సేవల గురించి ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు కలిగి ఉండటంతో పాటు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి, బ్యాంక్ శాఖ మేనేజర్ పరమేశ్వర్, ఫీల్డ్ ఆఫీసర్ నవీన్ రెడ్డి, జనగామ ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్ అనిల్ గౌడ్, శ్రీమతి ఉదయతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేశారు.




# అంగన్‌వాడీలో ఘనంగా అక్షరాభ్యాసం

**జనగామ, జూన్ 16 (డిడి 9వార్త) బ్యూరో**

చిన్నారులకు విద్యా ప్రస్థానానికి శ్రీకారం చుట్టిన సర్పంచ్ శ్రీధర్ గౌడ్ నర్మెట్ట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ పాఠశాలలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్మెట్ట సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారి విద్యా ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ, అక్షరాభ్యాసం ప్రతి చిన్నారి జీవితంలో ఒక కీలక ఘట్టమని పేర్కొన్నారు. విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసంతో పాటు సమాజ పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. చిన్నారులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అనంతరం చిన్నారులను ఆశీర్వదించిన ఆయన, తల్లిదండ్రులు పిల్లల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొలేపాక స్వామి, ఆగపేట సర్పంచ్ పగిడిపాటి రాజు, వార్డు సభ్యులు కొలేపాక యాదగిరి, ఐసీడీఎస్ సూపర్వైజర్ శృతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు రజిత కుమారి, బి.సృజన, శోభాదేవి, స్వరూపరాణి, విజయలక్ష్మి, ఏఎన్ఎం కరుణ, ఆశా వర్కర్లు మంగ, నాయకులు చెప్పాల విజయ్, గ్రామ మహిళలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ విద్య బలోపేతానికి కఠిన నిర్ణయాలు అవసరం

- **ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలి**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 16 (డిడి9 వార్త):**



రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. ఆ విశ్వాసం పెరగాలంటే ముందుగా ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదివించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

ప్రస్తుతం చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తూనే తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వ విద్యపై సమాజానికి తప్పు సంకేతాలు వెళ్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు ఎక్కువగా ప్రభుత్వ విద్య ద్వారానే ఎదిగినప్పటికీ, నేడు అదే విద్యా వ్యవస్థపై నమ్మకం చూపకపోవడం ఆందోళనకర విషయం.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలంటే కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యను అభ్యసించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థుల ఫలితాలు, నాణ్యమైన బోధనపై మరింత బాధ్యతతో వ్యవహరించేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రభుత్వ విద్యారంగంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, నాణ్యమైన బోధన, సాంకేతిక వసతుల కల్పనతో పాటు బాధ్యతాయుతమైన పరిపాలన కూడా అవసరం. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యత పెరిగితేనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన విద్య అందుబాటులోకి వస్తుంది.ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావడం సమాజ పురోగతికి కీలకం. అందుకోసం ప్రభుత్వం, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.






# జిల్లాస్థాయి అండర్16 సమ్మర్ కప్ క్రికెట్ టోర్నీలో ఎన్‌టీపీసీ 22 యార్డ్స్ అకాడమీ రన్నరప్

- **బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రోహిత్‌కు అవార్డు – కేడీసీఏ ప్రతినిధులు, సీనియర్ క్రికెటర్ల అభినందనలు**
- **కోచ్ సుదేశ్ కుమార్ శిక్షణలో విజయపథంలో అకాడమీ**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 16 (డిడి9 వార్త):**

కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అలుగునూరు మైదానంలో నిర్వహించిన అండర్16 సమ్మర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎన్‌టీపీసీ/గోదావరిఖని చెందిన 22 యార్డ్స్ క్రికెట్ అకాడమీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ విషయాన్ని అకాడమీ కోచ్ సుదేశ్ కుమార్ తెలిపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ అంతటా అద్భుత ఆటతీరును ప్రదర్శించిన ఎన్‌టీపీసీ 22 యార్డ్స్ క్రికెట్ అకాడమీ జట్టు ఫైనల్‌కు చేరుకుని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.ఈ టోర్నమెంట్‌లో ఎన్‌టీపీసీ అకాడమీకి చెందిన ఆటగాడు రోహిత్ బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డును అందుకుని ప్రతిభ చాటాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమర్థవంతమైన ప్రదర్శనతో జట్టుకు కీలక విజయాలు అందించాడని కోచ్ సుదేశ్ కుమార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి. మనోహర్ రావు, ఉపాధ్యక్షుడు ఎన్. మురళీధర్ రావు, గోదావరిఖని సీనియర్ క్రికెటర్ డి. కిరణ్ కుమార్ యాదవ్ తదితరులు జట్టు సభ్యులను, కోచ్ సుదేశ్ కుమార్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల కృషి, క్రమశిక్షణ ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని కోచ్ సుదేశ్ కుమార్ తెలిపారు. యువ క్రీడాకారులకు ఇలాంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.






# షైన్ హై స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు గురికావొద్దు

- **నాణ్యమైన విద్యను అందించడమే మా షైన్ హై స్కూల్ లక్ష్యం**
- **పాఠశాల కరెస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా**

**బోనకల్,జూన్16,(డీడీ9 వార్త):**

గ్రామీణ ప్రాంతాల్లో మన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా షైన్ హై స్కూల్ పనిచేస్తుందని పాఠశాల కరస్పాండెంట్ పాషా తెలిపారు. గత కొన్ని రోజులుగా నెలకొన్న పరిస్థితులపై మంగళవారం ఆయన డీడీ9 వార్తతో ముఖాముఖి మాట్లాడారు.

డీడీ9 వార్త:చివరి విద్యా సంవత్సరం చివరిలో ఉపాధ్యాయులు పాఠశాల నుంచి వెళ్లారు వారి స్థానంలో నూతన నియామకాలు జరిగాయా?

కరెస్పాండెంట్ పాషా: కొంతమంది వారి వ్యక్తిగత కారణాలతో బయటకు వెళ్లారు వారి స్థానంలో ఆ సంవత్సరం చివరిలోని ఉపాధ్యాయులను నియమించడం జరిగింది.

**డీడీ9 వార్త: షైన్ హై స్కూల్ పార్ట్నర్స్ మధ్య నెలకొన్న పరిస్థితులపై మీ వివరణ**

కరెస్పాండెంట్ పాషా : నేను నాతో పాటు పార్ట్నర్ గా ఉన్న యరమల సంజీవరెడ్డికి మా మధ్య ఎలాంటి వివాదాలు లేవు,కేవలం చిన్నపాటి ఆర్థిక పరమైన అంశాల మధ్య కొంత గ్యాప్ వచ్చింది.అవి కూడా పరిష్కరించుకోవడం జరిగింది.అటువంటి సమస్యలు పునరావృతం కావు.

**డీడీ9 వార్త:చివరిగా విద్యార్థులతో తల్లిదండ్రులకు మీరిచ్చే సందేశం**

విద్యార్థుల తల్లిదండ్రులు ఎటువంటి అపోహలకు గురికాకుండా,ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా మీ పిల్లలను సైన్ హై స్కూల్ కి పంపించండి,వారి ఉజ్వల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించే ప్రయత్నంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి 1వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రోబోటిక్స్ కోర్స్ ని తీసుకువస్తున్నాం అందుకు కావలసిన టీచర్లను తీసుకోవడం జరిగింది.ప్రస్తుత విద్యా సంవత్సరం జూన్ 15 నుండి ప్రారంభమైంది, అడ్మిషన్లు కూడా జరుగుతున్నాయి.



## డ్రాగ్‌లైన్ స్క్రాప్ చోరీ కేసులో అమాయక కాంట్రాక్టర్‌ను బలిపశువుగా చేస్తున్నారంటూ ఆరోపణ

- **కాంట్రాక్ట్ ముగిసిన ఆరు రోజుల తర్వాత జరిగిన ఘటనకు బాధ్యుడిని చేయడం అన్యాయం : బాధితుడు**
- **ఎఫ్ఐఆర్‌లో రూ.1 లక్ష నష్టం.. రికవరీ మాత్రం రూ.16 లక్షలు విధించడంపై ప్రశ్నలు**
- **భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే కాంట్రాక్టర్‌పై చర్యలంటూ ఆరోపణ**
- **సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు జోక్యం చేసుకుని నిష్పక్షపాత విచారణ జరపాలని విజ్ఞప్తి**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 16 (డిడి9 వార్త):**


సింగరేణి ఆర్జీ3 ఏరియాలో జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనం కేసులో అమాయక కాంట్రాక్టర్‌ను బలిపశువుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని బాధిత కాంట్రాక్టర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు జోక్యం చేసుకుని నిష్పక్షపాత విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. మంగళవారం సెంటినరీ కాలనీలో నిర్వహించిన మీడియా సమావేశంలో బాధిత కాంట్రాక్టర్ మాట్లాడుతూ, శ్రీజ ఇన్ఫ్రా సెక్యూరిటీ కాంట్రాక్ట్ 02 మార్చి 2023న ప్రారంభమై 15 ఏప్రిల్ 2026న ముగిసిందన్నారు. కాంట్రాక్ట్ గడువు ముగిసినట్లు ఏరియా సెక్యూరిటీ కార్యాలయం అధికారికంగా లేఖ కూడా జారీ చేసిందని తెలిపారు. అయితే కాంట్రాక్ట్ ముగిసిన ఆరు రోజుల తర్వాత, అంటే 21 ఏప్రిల్ 2026న జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనం ఘటనకు తనను బాధ్యుడిగా చూపిస్తూ రూ.16 లక్షల నష్టం భరించాలని లేఖ పంపడం పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు.

మరో కాంట్రాక్టర్ పరిధిలో ఘటన జరిగినా తమపైనే భారం

దొంగతనం కేసులో పేర్లు వచ్చిన సెక్యూరిటీ గార్డులు శ్రీజ ఇన్ఫ్రా నియమించుకున్న సిబ్బంది కాదని, వారు గత ఆరు సంవత్సరాలుగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారేనని చెప్పారు. సంఘటన జరిగిన సమయంలో భద్రతా బాధ్యతలు మరో కాంట్రాక్టర్ పరిధిలో ఉన్నప్పటికీ తమపై కేసు మోపడం కక్షపూరిత చర్యగా కనిపిస్తోందన్నారు.

రికవరీ మొత్తంపై అనుమానాలు

పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో దొంగిలించబడిన స్క్రాప్ విలువ సుమారు రూ.1 లక్షగా పేర్కొన్నప్పటికీ, ఏరియా సెక్యూరిటీ అధికారి ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా రూ.16 లక్షల రికవరీ విధించడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు.


THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
(A GOVT. COMPANY)
S & PC DEPARTMENT: RAMAGUNDAM – 3 DIVISION

Ref.No:RG.3/S&PC/78/2026/360 Date:21/05/2026.

M/s Sreeja Infra,
H.No. 6-382/A,
Power House Colony,
Godavarikhani.

Sir,

Sub:-Theft of 980 mtrs of 185sqmm cable from surveyed-off Dragline at RGOCM-I – Reg.
Ref:- 1). PO.No. 7500051742, Dated:- 02-03-2023,
2). RG3/EOC1/02/2026/69, Dated: 23.04.2026.
***

With reference to the above purchase order under ref.no.1, supply of Outsourced Security Guards contract was awarded to you for protecting Company's property.

With reference no.2 cited above, 980mts of 185sqmm Single Core armored Cable approximate cost of Rs.16,00,000/- was found missing from surveyed-off Dragline at RGOCM-I.

Upon preliminary enquiry and police enquiry it is revealed that your private security personnel were involved in this theft incident as cooperative to the miscreants in their shifts while your firm running.

"As per the order terms and condition no. 1.7.ix " In the event of any theft of property entrusted to the successful tenderer the same shall be brought immediately to the notice of SCCL officials and preliminary investigate report is to be submitted to enable them to take up the matter further. The successful tenderer shall also pursue the same with the police or any other agency/authority for recovery of stolen property. The value of the items stolen will be deducted from the bills of the successful tenderer if the material is not recovered".

It is to inform you that the cost of the stolen cable i.e. Rs.16,00,000/- will be deducted from the bills as per the terms and conditions of the order.

General Manager,
Ramagundam-3 Area.

Cc to: GM (Vigilance),
DGM (F&A) RG-3 → Deduct the above mentioned amount from the Bills.


సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా చర్యలు

తన వివరణ తీసుకోకుండా, ఎటువంటి విచారణ నిర్వహించకుండా భారీ మొత్తాన్ని రికవరీ చేయాలని నిర్ణయించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఏరియా సెక్యూరిటీ అధికారుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఒక అమాయక కాంట్రాక్టర్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోందన్నారు.

రికవరీ ఉత్తర్వులు రద్దు చేయాలి

ఈ వ్యవహారంపై సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, నిజమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కాంట్రాక్టర్ డిమాండ్ చేశారు. తనపై విధించిన రూ.16 లక్షల రికవరీ ఉత్తర్వులను రద్దు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.




(A GOVT. COMPANY)
S & PC DEPARTMENT: RAMAGUNDAM – 3 DIVISION

REF.No:RG.3/S&PC//2026/ 227 Date: 15/04/2026.

M/s Sreeja Infra,
H.No. 6-3-82/1,
Power House Colony,
Godavarikhani-505209.

Sub:- Out Sourcing of services for secuards and one supervisor for RG3 and APA Area for a period of 3 years – termination - Reg.
Ref:- 1) PO.No.7500051742, Dated:- 02/03/2023.
2) RG3/PD/7500051742/2026/1305, Dated:02.03.2026.
***

Order under reference (1) was placed on your firm for providing 70 security guards and one supervisor to RG3/APA Area.

Vide under reference (2) the validity of order is extended for another 03 months or till deployment of services against fresh order to be released, whichever is earlier.

Relay order was released and the new firm has ready to deploy of Security Guards from 16-04-2026. Hence you are ordered to stop deploying Security Guards after 3rd shift of 15-04-2026.

Area Security Officer,
S&PC, RG-3 Area.

cc to: DGM(PER), RG3,
AGM(F&A), RG3,
SE(Purchase), RG3.



## ఓదెల మల్లన్న ఆలయానికి మాస్టర్ ప్లాన్.

- **ఓదెల మల్లిఖార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.15 కోట్లు.**

**డిడి9వార్త /పెద్దపల్లి జూన్ 17:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రసిద్ధ ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ పునరుద్ధరణ కోసం రూ.10 కోట్ల నిధులు కేటాయించడంతో పాటు ఆలయ ప్రత్యేక నిధులు నుండి 5 కోట్ల రూపాయలు (మొత్తం 15 కోట్ల రూపాయలతో) అభివృద్ధి పరిచే శ్రీ. ఓదెల మల్లిఖార్జున స్వామి వారి దేవాలయం యొక్క మాస్టర్ ప్లాన్ ను హైదరాబాద్ బొగ్గులకుంట లోని ధార్మిక భవన్ అయిన దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి కార్యాలయంలో సంబంధిత అధికారులు మరియు స్థాపతి వల్లినయాగన్ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు కి వివరించారు.ఈ కార్యక్రమంలో ఓదెల మండల పార్టీ అధ్యక్షులు మరియు ఓదెల ఆలయ చైర్మన్, డైరెక్టర్లు మరియు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి నీరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- **సీపీఐఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను డిమాండ్**

**తిరుమలాయపాలెం, జూన్ 16, డి డి 9 వార్త**

తిరుమలాయపాలెం మండలంలోని మంగళవారం,కాకరవాయి గ్రామంలో సిపిఐఎం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది యొక్క సమావేశానికి శాఖ కార్యదర్శి వీరబోయిన నాగయ్య అధ్యక్ష వహించారు మండలంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని రాజకీయాలతో సంబంధం లేకుండా పేదలకు ఇల్లు ఇవ్వాలని తిరుమలాయపాలెం మండలంలో దళితవాడలో కాలనీ ఇండ్లలో కూలిపోయి పాత పెంకుటిండ్ల స్థానంలో కొత్త ఇండ్లు మంజూరు చేయాలని పేరుకి ఇండ్లు ఉన్నట్టు ఇంటి నెంబరు ఉండి ఇల్లు ఉన్నట్టు ఉన్న కానీ ఆ యొక్క ఇల్లు కూలిపోయే దశలో ఉందని అందుకు ప్రభుత్వం ఆలోచించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో సిపిఎం మండల నాయకుడు కొత్తపల్లి వెంకన్న వశపోంగు వీరన్న నేరుసుల,వెంకటేశ్వర్లు,కొత్త మధు గుండాల వెంకన్న పరిపూర్ణ చారి సీపీఎం మండల కమిటీ నాయకులు గ్రామ ప్రజలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఈజీఎస్ కూలీలకు అన్నదానం చేసిన బంజేరుపల్లి సర్పంచ్

- **మంత్రి సీతక్క నాకు స్ఫూర్తి**
- **గ్రామ సర్పంచ్ కంచం రఘు**

**ములుగు, జూన్ 16, డీ డీ 9 వార్త :**


ములుగు జిల్లా, ములుగు మండలం బంజరుపల్లి గ్రామ సర్పంచ్ కంచం రఘు ఈజిఎస్ కూలీలకు అన్నదానం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సామాజిక సేవలో మంత్రి సీతక్కను స్ఫూర్తిగా తీసుకున్న సర్పంచి రఘు గ్రామాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్తూ జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిస్వార్థంగా కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే ఆయన ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న క్రమంలో వారి ఆకలి తీర్చేందుకుగాను మంగళవారం మధ్యాహ్నం అన్నదానం చేయడం జరిగింది. జిల్లాలోనే మొట్టమొదటిసారి ఉపాధి హామీ కూలీలకు అన్నదానం చేసిన సర్పంచ్గా రికార్డుకు ఎక్కారు. కూలీలకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించిన బంజరుపల్లి గ్రామ సర్పంచ్ కంచం రఘును పలువురు అభినందిస్తున్నారు. గ్రామాభివృద్ధికి నిస్వార్థంగా సేవ చేస్తున్న సర్పంచ్ కంచం రఘు కు కూలీలు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## సింగరేణి స్కూల్ విద్యార్థుల బస్ సౌకర్యం ఎత్తివేతను ఖండిస్తున్నాం

- **యాజమాన్యం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి**
- **తల్లిదండ్రులతో కలిసి ఆందోళనకు సిద్ధమని హెచ్చరిక**
- **ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 16 (డిడి9 వార్త):**



సింగరేణి స్కూల్‌లో చదువుతున్న కార్మికుల పిల్లలకు బస్ సౌకర్యాన్ని ఎత్తివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్జీ 1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు.

ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు విద్యతో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అలాంటి సమయంలో బస్ సౌకర్యాన్ని ఎత్తివేయడం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందులు కలిగించే నిర్ణయమని విమర్శించారు.

సింగరేణి కార్మికుల పిల్లలు వివిధ ప్రాంతాల నుంచి స్కూల్‌కు వస్తున్నందున బస్ సౌకర్యం లేకపోతే వారి చదువులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చిన్నారులు రోజువారీగా పాఠశాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.యాజమాన్యం వెంటనే తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, విద్యార్థులకు బస్ సౌకర్యాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కార్మిక కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రంగు శ్రీను హెచ్చరించారు.



## యువతే దేశ భవిష్యత్తు

- **ఎన్ ఆర్ ఐ చైతన్య**

**భూపాలపల్లి జూన్ 16 ( డిడి 9 వార్త )**

రాజకీయాలకు అతీతంగా భారత దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని క్రిష్ణ చైతన్య తన సందేశాన్ని పంపారు. యువత ఇతర మార్గాల వైపు చూడకుండా ఉండేందుకే తనవంతుగా ప్రయత్నం చేస్తున్నానని అందులో భాగంగానే క్రీడలపై ఆసక్తి ఉన్న యువకులను ప్రోత్సహిస్తున్నానని ఆయన అన్నారు. మంథని నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యువకులకు ఆయన క్రికెట్ కిట్ ను తన అభిమానుల ద్వారా మంగళవారం నాడు అందజేశారు. ఇ సందర్భంగా ఆయన తన సందేశాన్ని సామాజిక మాద్యమం ద్వారా పంపారు. అ సందేశంలో యువకులు ఈ కుటుంబం తో పాటు దేశం కోశం పనిచేయాలని అన్నారు. ఈ కార్యకమంలో స్థానిక యువ నాయకుడు కళ్యాణ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు



## బంజరుపల్లి లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

**డీ డీ 9 వార్త, ములుగు :**

బంజరుపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు మల్రిపల్లి శ్రీలత గారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించడం. జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన చిన్నారులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, అక్షరాభ్యాసం అనేది విద్యాభ్యాసానికి తొలి మెట్టు అని ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత తెలిపారు. ప్రతి బాలుడు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

అనంతరం చిన్నారులతో సంప్రదాయ పద్ధతిలో అక్షరాభ్యాసం నిర్వహించి, వారి విద్యా ప్రయాణానికి శుభారంభం కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో పాల్గొని తమ పిల్లల విద్యాభ్యాసానికి సహకరిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ్ కుమార్ పాల్గొని చిన్నారులకు ఆశీర్వాదాలు అందించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుదలతో పాటు ప్రతి విద్యార్థిలో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని,ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని తల్లిదండ్రులకు అవగాహన కలిగించడం జరిగింది.



## దోమలవాగు మినీ రిజర్వాయర్ అభివృద్ధికి శ్రీకారం..

- **సీతారామ కాలువ జలాల మళ్లింపునకు యూటీ నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాయం.**

**మణుగూరు.జూన్ 16(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో మంగళవారం నాడు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పర్యటించి, నకిరేపేట గ్రామ పరిధిలోని దోమలవాగు చెరువుకు సీతారామ కాలువ నుంచి నీటి మళ్లింపునకు నిర్మించనున్న యూటీ (UT) పనులకు భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.20 లక్షల వ్యయంతో యూటీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే, అశ్వాపురం మరియు బూర్గంపాడు మండలాల్లోని ప్రతి ఎకరానికి సీతారామ కాలువ ద్వారా గోదావరి జలాలు అందేలా కృషి చేస్తున్నామని, రైతుల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి, రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల వేదిక మహాధర్నకు ప్రతి ఒక్కరూ రావాలి.

- **తోడేటి శంకర్ గౌడ్ తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్.**

**డిడి9వార్త / రామగుండం జూన్ 17:**

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖని పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఉద్యమ కార్ల ముఖ్య సమావేశం నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక తోడేటి శంకర్ గౌడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ మాట్లాడుతూ గురువారం రోజున హైదరాబాదులో ఇంద్ర పార్క్ వద్ద మహాధర్నా ఉంది. ఈ ధర్నాకు తెలంగాణ ఉద్యమకారులు అందరూ 33 జిల్లాల నుండి నిజమైన ఉద్యమకారులు అమరవీరుల కుటుంబాలు కావచ్చు,ఉద్యమంలో వికలాంగులు అయిన కుటుంబాలు కావచ్చు, జైలుకు వెళ్లిన ఉద్యమకారులు, ఎఫ్ఆర్ఐ నంబర్ ఉన్నఉద్యమకారులు, బైండ్వరు అయి ఉన్నవాళ్లు పేపర్ కటింగ్, వంట వార్పు రహీం రోగం రాస్తా రోకో ఎవరైతే ప్రూఫ్ ఉన్నవాళ్లు ఉద్యమకారులు రేపు గురువారం రోజున 10 గంటలకు హైదరాబాదు ఇందిరాపార్కు వద్ద ఉద్యమకారులందరూ ఈసభకు చేరుకొని విజయవంతం చేయాలని 33 జిల్లాల ఉద్యమకారులకు పిలిపి ఇవ్వడం జరుగుతుంది. ఉద్యమకారులము మేము కోరుకునేది ఒకటే గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వలన ఉద్యమకారులకు న్యాయం జరగలేదు. ఉద్యమకారులు అనేది అసలు కేసీఆర్ గుర్తించకపోవడం చాలా బాధాకరం చాన దురదృష్టకరం,ఉద్యమకారుల త్యాగం మరువలేనిది ఉద్యమకారులు చాలామంది అన్నం తినక అటుకులు బుక్కి మంచిళ్ళు తాగి తాగా ఉద్యమంలో పాల్గొన్నరు. మరి ఆ రోజుల్లో 10 సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వాన్ని ఏలి ముఖ్యమంత్రి ఉండి

ఉద్యమకారులను మర్చిపోవడం చాలా దురదృష్టకరం బాధాకరం అమరవీరుల కుటుంబాల త్యాగాలతో, ఉద్యమకారుల త్యాగాలతో తెలంగాణ వచ్చింది తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారులను మర్చిపోవడం కేసీఆర్ కు మంచిది కాదనే ఆలోచన కొద్దీ కేసీఆర్ ను గద్దె దించిరు ఉద్యమకారులు ఇప్పుడున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఉద్యమకారులకు గుర్తింపు కార్డు 250 గజాల జాగా, 25 వేల పెన్సిల్ రైల్వే పాసు, బస్సు పాసు ఉద్యమకారుకు హెల్త్ కార్డు 20 లక్షల వరకు, ఉద్యమకారుల కుటుంబంలో 10 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని ఎన్నికల ముందు మాటిచ్చింద్రు మెయిన్ పోస్టర్లు పెట్టడం జరిగింది . ఇప్పుడున్న ముఖ్యమంత్రి హామీలు ఇచ్చి గద్దెనెక్కిండు మరి రెండు సంవత్సరాలు గడిచిపోయినా కానీ ఉద్యమకారులను పట్టించుకున్న దాకా లేదు మా ఉద్యమకారుల వేదిక ఒకటే కోరుకుంటుంది అయ్యా రేవంత్ రెడ్డి మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చుమని మేము అడుగుతున్నాము. మేము ఏమి గొంతమ్మ కోరికలు కోరడం లేదు కేశవరావు కమిటీ అని ఆరూర్తో ఒక కమిటీ కాలాక్షేపంచేయకుండా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని హైదరాబాదులో ఇందిరా పార్కు వద్ద ధర్నా కార్యక్రమం ఉంది ఉద్యమకారులందరూ వచ్చి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారులను పిలుపునిస్తున్నాము.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్, గ్రామల నియవర్గం ఇంచార్జి నూతి తిరుపతి, మహిళ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనుముల కళావతి, గంగారపు శాంత లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ వర్ష స్వాతి, మహిళా ప్రధాన కార్యదర్శి సిల్క్ శంకర్, రాష్ట్ర కార్యదర్శి పిల్లి రమేష్, సీనియర్ ఉద్యమ నాయకుడు వల్లాల మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా విరలాల్, ఎన్టిపిసి పట్టణ అధ్యక్షులు తోట సురేష్, శంకరు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి క్యాంపులకు వెళ్లే రోగుల ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

- **ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగుల సమస్యలు తెలుసుకున్న టిబిజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు.**

**మణుగూరు. జూన్ 16(డి డి 9వార్త)**

సింగరేణి యాజమాన్యం కార్పొరేట్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ప్రతి నెల రెండు ఆదివారాలు కొత్తగూడెం సింగరేణి ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలకు హాజరయ్యే రోగులకు, వారితో పాటు వెళ్లే ఎస్కార్ట్‌లకు ఇప్పటివరకు అందిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను ఈ నెల నుంచి రద్దు చేయడం సరికాదని, ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని టిబిజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

మంగళవారం మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మణుగూరు ఏరియా నుంచి ప్రతి క్యాంప్‌కు సుమారు 60 నుంచి 70 మంది రోగులు కొత్తగూడెం ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ఇలాంటి పరిస్థితిలో ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను నిలిపివేయడం రోగులపై అదనపు ఆర్థిక భారం మోపినట్లేనని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రోగులు తమ సమస్యలను నాగెల్లి వెంకటేశ్వర్లుకు వివరించారు. మణుగూరు సింగరేణి ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, 2డి ఎకో టెక్నీషియన్ లేకపోవడం, ల్యాబ్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడం, ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

అలాగే రిఫరల్ ద్వారా హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు చేయించుకుని అక్కడి వైద్యులు సూచించిన మందులు స్థానిక ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, అవసరమైన టాబ్లెట్లు, ఇంజెక్షన్లు నిరంతరం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోగులు ప్రస్తావించిన అన్ని సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తానని నాగెల్లి వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మునిగేల నాగేశ్వరరావు, దాసరి కృష్ణ, మొగిలి రాజయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులకు రూ.26,000 వేతనం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం ఎందుకు?

- **ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించిన ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 16 (డిడి9 వార్త):**

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ కార్మికులు తదితర కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం ఆసుపత్రి ఆవరణలో వైనాల రవి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ మాట్లాడుతూ, అత్యవసర సేవలు అందిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.26,000 కనీస వేతనాన్ని అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజురోజుకూ పని భారం పెరుగుతున్నప్పటికీ, కాంట్రాక్టు కార్మికులకు వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కష్టపడి విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని నెలకు రూ.26,000 వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు కూడా ఈ వేతనాన్ని పరిగణనలోకి తీసుకుని టెండర్లు దాఖలు చేయాలని, లేకపోతే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు,పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం, కనీస వేతనాల అమలు కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని కడారి సునీల్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐలక్క, రాజేశ్వరి, నర్మదా, బాల్‌రాజ్, వైనాల రవి, మల్లమ్మ, రాజేష్, మౌనిక, సరిత, హనుమంతు, ఎల్లమ్మ, సుశీల, రమ్య, సునీత, వంశీ, నరేష్, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద, అనాథ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

- **10 ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం..**
- **నిరుపేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సామాజిక కార్యకర్త కర్నె రవి పిలుపు.**

**మణుగూరు.జూన్ 16(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యా పథకం కింద చదువుకుంటున్న విద్యార్థులలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి ఉత్తీర్ణులైన వారి స్థానంలో కొత్త విద్యార్థుల చేరికకు అవకాశం కల్పిస్తున్నట్లు సామాజిక కార్యకర్త కర్నె రవి తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 10 ఉచిత సీట్ల భర్తీకి అర్హులైన నిరుపేద, అనాథ మరియు వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.మణుగూరు మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం 79 మంది విద్యార్థులు ఈ ఉచిత విద్యా పథకం ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతి పూర్తి చేసి బయటకు వెళ్లే విద్యార్థుల స్థానాల్లో కొత్త అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసే విధానం అమలులో ఉంది. కాబట్టి అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు,

**తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు,**

ఒంటరి తల్లి లేదా తండ్రి సంరక్షణలో ఉన్న విద్యార్థులు, దివ్యాంగుల పిల్లలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు లిఖితపూర్వక దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి మణుగూరు మండల విద్యాశాఖాధికారి (MEO) కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుంది. అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హత, ఆర్థిక పరిస్థితి మరియు నిబంధనల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.



"ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క బాలుడు లేదా బాలిక కూడా విద్యకు దూరం కాకూడదు. ప్రైవేట్ పాఠశాలల్లో లభించే ఈ ఉచిత విద్యా అవకాశం పేద విద్యార్థుల జీవితాలను మార్చగలదు. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు, అత్యంత నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని కర్నె రవి పిలుపునిచ్చారు.మీ పరిసర ప్రాంతాల్లో చదువుకు ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో విద్య కొనసాగించలేని పిల్లలు ఉంటే, వారికి ఈ సమాచారం చేరవేసి MEO కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా సహాయం చేయండి. సమాజంలో ప్రతి చిన్నారికి విద్య అందించడం మనందరి బాధ్యత" అని కర్నె రవి పేర్కొన్నారు.మణుగూరు మండల ప్రజలు ఈ సమాచారాన్ని విస్తృతంగా పంచుకోవాలని, అర్హులైన నిరుపేద మరియు అనాథ పిల్లలకు ఈ అవకాశాన్ని అందించేందుకు సహకరించాలని కోరారు. ఆలస్యం చేయకుండా దరఖాస్తులు సమర్పించి ఉచిత విద్యా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మండల విద్యాశాఖాధికారి (MEO) కార్యాలయం, మణుగూరు నందు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారులు ఆదాయ ధ్రువీకరణ పత్రం, అనాథ ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), ఆధార్ కార్డు, విద్యార్థి చదువు ధ్రువీకరణ పత్రం మరియు ఇతర సంబంధిత పత్రాలను జతచేసి దరఖాస్తు సమర్పించాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా న్యాయమూర్తి జన్మదిన వేడుకలు

**భద్రాచలం, జూన్ 16, డిడి9 వార్త**

భద్రాచలం కోర్టు ఆవరణలో జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి. శివనాయక్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కోర్టు ఆవరణలో కేక్ కట్ చేసి, న్యాయమూర్తికి పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన న్యాయమూర్తిగా అందిస్తున్న సేవలను సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాభవాని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రెటరీ తాతా లలిత, కోశాధికారి దన్నాన రాము, లేడీ రిప్రజెంటేటివ్ ఎం. తరుణి, సీనియర్ న్యాయవాదులు ఎం.వి. రమణారావు, గోడపర్తి నాగరాజు, రావి రామ్మోహన్, ఆర్. జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## పస్రా పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ.

- **వర్షా కాల విపత్తులపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఆదేశం**

**గోవిందరావుపేట,జూన్ 16(డిడి 9 వార్త)**

ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ మంగళవారం పస్రా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో 5S విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని రిసెప్షన్ సిబ్బందికి సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వరదలు లేదా ఇతర విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలకు వెంటనే సహాయ సహకారాలు అందించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ, వాటిని ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో ములుగు డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ దయాకర్, ఎస్ఐ తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాటలు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి

- **సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి మీకు లేదు**
- **ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి.**

**ములుగు జిల్లా తాడ్వాయి మండలం(డిడి 9 వార్త) జూన్ 16**


కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు ఎంత వరకు అమలు చేశారో చూపించాలివందల ఎకరాల్లో అక్రమంగా భూములు లాక్కుని ఫామ్ హౌస్ కట్టుకుని భూదందా చేసింది కేసీఆర్ కుటుంబం అని మరిచావా మాజీ మంత్రి రాష్ట్రాన్ని దోచుకున్నారు కాబట్టే జరిగిన ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని విడగొట్టి ఇంట్లో కూర్చోబెట్టారు

దళిత జాతికి చెందిన వ్యక్తినీ ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి మోసం చేశారని పేద ప్రజలకు ఇస్తానన్న మూడు ఎకరాల భూమి,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు,ఇంటికో ఉద్యోగం,నిరుద్యోగ భృతి, వంటి పథకాలను కనీసం అమలు చేయకుండా



రాష్ట్ర ప్రజలను మోసం చేసి రెండవ సారి అధికారంలోకి వచ్చి పేద ప్రజల సొమ్ము దోచుకున్నారు మీరు మంత్రిగా ఉన్నప్పుడు ఎలాంటి అభివృద్ధి చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి చేసే అభివృద్ధి చూసి ఓర్వలేక నిందలేయడం సరికాదని అన్నారు

ప్రతిపక్షంలో ఉండి కూడా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి సహకరించకుండా ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడుతూ ఉన్న బిఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు



# సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండలానికి సాగునీటి వెలుగులు..

- **మారెళ్ళపాడు లిఫ్ట్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూన్ 16(డి డి 9వార్త)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్ట్ కాలువ - మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఈరోజు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ప్రాజెక్టు పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, చేపడుతున్న సాంకేతిక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రైతులకు సాగునీరు త్వరితగతిన అందే విధంగా పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. "సీతారామ ప్రాజెక్ట్ పినపాక నియోజకవర్గ వ్యవసాయ రంగానికి జీవనాడిగా నిలుస్తుంది. ప్రతి ఎకరాకు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే మా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం" అని పేర్కొన్నారు.

అదేవిధంగా, అశ్వాపురం మండలంలోని సంద్రలబోడు, అమెర్ద గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల చెరువులు, కుంటలకు సీతారామ ప్రాజెక్టు నీటిని అందించే విస్తరణ పనులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించి ఆయా గ్రామాలకు సాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పినపాక నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం కృషి చేస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ఎమ్మార్వో, మండల పరిషత్ అధికారులు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి బిక్ష్మయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, తుక్కాని మధుసూదన్ రెడ్డి, సర్పంచ్‌లు సబ్కా పిచ్చయ్య, మచ్చా నరసింహరావు, యేనిక ఉషారాణి, ఇర్పా కవిత, ఎట్టి నరేష్, కలివేటి సరిత, లంకమల్ల కొండలరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వేములపల్లి రమేష్, బట్టా సత్యనారాయణ, ఎం.డి. షర్ఫుద్దీన్, కాకా రాములు, చుంచు ఏకాంబరం, కొమరం భాస్కర్, ఆవుల రవి, తెల్లం వీరభద్రం, రావులపల్లి వెంకటనర్సయ్య, తూము వీరరాఘవులు, రనబోతుల రామిరెడ్డి, కుందూరు శ్రీనివాసరెడ్డి, యేనిక రవి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# జనగామ పల్లెల అభివృద్ధికి రూ.91 లక్షలు

**జనగామ జూన్ 16(డిడి 9 వార్త ) బ్యూరో**

18 ఉపాధి హామీ పనులకు ప్రతిపాదనలు జనగామ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి రూ.91 లక్షలతో 18 అభివృద్ధి పనుల ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. 202627 ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టాలని కోరారు. ప్రతిపాదనల్లో మద్దూరు, చేర్యాల మండలాల్లోని 10 ప్రభుత్వ విద్యాసంస్థలకు రక్షణ గోడల నిర్మాణం, కొమురవెల్లి మండలంలోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ధూళిమిట్ట మండల తండాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పనులు పూర్తి అయితే గ్రామాల్లో మౌలిక



వసతులు మెరుగుపడి పల్లెల రూపురేఖలు మారనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గాలి నరసింహారావు మృతదేహాన్ని సందర్శించిన మాజీ ప్రజా ప్రతినిధులు

**బోనకల్,జూన్16,(డీడీ9 వార్త):**

బోనకల్ గ్రామానికి చెందిన గాలి నరసింహారావు మృత దేహాన్ని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు,స్నేహితులు ,బంధువులు ఘనంగా నివాళులర్పించారు. నరసింహారావు పార్థివ దేహాన్ని సందర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ , సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,గాలి నరసింహారావు మరణం వారి కుటుంబానికి మాత్రమే కాకుండా గ్రామానికి కూడా తీరనిలోటని అన్నారు.ఆయన నిరాడంబర జీవనం, అందరితో స్నేహపూర్వకంగా మెలగడం,సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వల్ల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.




నరసింహారావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.అనంతరం పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మరిదు శేషు,తెలుగు రమేష్,శ్రీనివాస ప్రసాద్,మంద రమణ, శివ,శ్రీను,గాలి కోటేశ్వరరావు గ్రామ పెద్దలు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంతాపాన్ని తెలియజేశారు.

# దమ్మపేట మండలంలో రూ.1.20 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...

- **దమ్మపేట మండలంలో రూ.1.20 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...**
- **ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే పల్లె పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుంది**

**అశ్వారావుపేట:జూన్ 16 ( డిడి 9వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలంలో రూ.1,20,80,000 విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా, రవాణా, చిన్నారుల సంక్షేమ మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన ఈ కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ సందర్భంగా అంకంపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని కొడిసెలగూడెంలో టిడబ్ల్యూయూపీఎస్ పాఠశాలకు నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు అనంతరం పట్వారిగూడెం గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ఎనిమిది సీసీ రోడ్లను ప్రజలకు అంకితం చేశారు

బాలరాజుగూడెం గ్రామపంచాయతీ దిబ్బగూడెం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించిన ఎమ్మెల్యే జారే మెండివారి గ్రామంలో రూ.11.80 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు నాగుపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన ఆధునిక అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించి చిన్నారుల విద్య పోషకాహారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు

తొట్టిపంపు గ్రామంలో ఎంపీయూపీఎస్ పాఠశాలకు రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను లింగాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గొర్రెగుట్ట గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.20 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడలను ప్రారంభించారు అలాగే మారప్పగూడెం గ్రామపంచాయతీ కొత్తూరులో రూ.8 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని పాత చీపురుగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే పల్లె పిల్లల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు కూడా నాణ్యమైన విద్యను అందుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన భద్రతా ప్రమాణాల మెరుగుదల విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు గ్రామీణ ప్రాంత పిల్లలు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడే స్థాయికి ఎదగడం మనందరి బాధ్యతని అన్నారు

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో





రోడ్లు విద్యాసంస్థలు అంగన్‌వాడీ కేంద్రాలు తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు సర్పంచులు ఉప సర్పంచులు కార్యకర్తలు మొదలైన వారు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో ఘనంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా జన్మదిన వేడుకలు..

**అశ్వరావుపేట:జూన్ 16(డిడి 9వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు మంగళవారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు జూపల్లి రమణారావు, సున్నం నాగమణి, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్‌మూర్తి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ భూక్యా ఉదయజ్యోతి, మందపాటి మోహన్‌రెడ్డి, కాసాని నాగశేష పద్మ, శంకా ప్రసాద్, జుజ్జురపు వెంకన్న బాబు, సంపూర్ణ, జుజ్జురపు శ్రీరామ్‌మూర్తి, మొటూరి మోహన్, చిక్కం మాధురి, ఎండి రహీన్ బేగం, సంకుల స్వరూపతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.




# అంబేద్కర్ ఆశయాలే దళితుల అభ్యున్నతికి మార్గం: పల్లా

**జనగామ జూన్ 16(డిడి 9వార్త ) బ్యూరో**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు.

అంబేద్కర్ దేశ ప్రజలకు కుల, మతాలకు అతీతంగా సమాన హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. దళితుల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గమే ఆదర్శమన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత సంక్షేమానికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని, దళితబంధు పథకం ద్వారా దళిత కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చేందుకు కృషి చేసిందని తెలిపారు.

హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం తెలంగాణ గర్వకారణమని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహ ప్రాంగణానికి తాళాలు వేయడం ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని, ప్రజల ఒత్తిడితోనే తిరిగి తెరవాల్సి వచ్చిందని అన్నారు. మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించడమే కాకుండా వారి ఆశయాలను ఆచరించాల్సిన అవసరం ఉందని పల్లా సూచించారు.




# భద్రాచలంలో 'బెల్టు'లకు బ్రేక్.. ఇకపై మద్యం షాపులు బంద్

- **గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం**
- **పిచ్చిమొక్కల తొలగింపు, డ్రైనేజీ పూడికలపై ప్రత్యేక దృష్టి**

**భద్రాచలం, జూన్ 16 , డిడి9 వార్త**

పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో మద్యం బెల్ట్‌షాపులను సామూహికంగా బంద్ చేయాలని భద్రాచలంలో మంగళవారం జరిగిన గ్రామ పంచాయతీ పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొందరు వార్డు సభ్యులు బెల్టుషాపుల బంద్‌పై చర్చకు పట్టుబట్టారు. ఈ సమయంలో తీర్మానంను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ప్రస్తావించగా సభ్యుల అభిప్రాయాలను సర్పంచ్ తెలుసుకున్నారు. ఈ సమయంలో పాలకవర్గ సభ్యులందరూ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో బెల్టుషాపుల బంద్‌కు అనుకూలంగా మాట్లాడారు. దీంతో భద్రాచలంలో ఇకపై బెల్టుషాపులు ఉండకూడదని తీర్మానం చేశారు. అలాగే నివాసాల మధ్య కాలి స్థలాలలో ఇష్టానుసారంగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించకుండా పట్టించుకోని భూ యజమానులకు తొలిత సమాచారం అనంతరం నోటీస్ జారీ చేసే విధంగా తీర్మానం చేసుకున్నట్లు తెలుస్తుంది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధాన డ్రైనేజీలను జెసిబి లతో పూడికలు తీయించడంతోపాటు ఇంటి పన్ను తదితర కీలక అంశాలపై పాలకవర్గం పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ పూనెం కృష్ణ, ప ంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# న్యాయవాదులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

- **ఈ నెల 20న హైదరాబాద్‌లో ఐలూ ధర్నా**
- **కరపత్రాలను ఆవిష్కరించిన భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు.**

**భద్రాచలం, జూన్ 16 , డిడి9 వార్త**

బార్ కౌన్సిల్‌లో నమోదైన న్యాయవాదులందరికీ ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర కమిటీ సభ్యులు టి. చైతన్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఐలూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా వారు ప్రదర్శించారు. న్యాయవాదుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించి హెల్త్ కార్డుల పంపిణీతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమానికి భద్రాచలం బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐలూ భద్రాచలం యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు బండారు అరుణ్ చంద్,పాయం రవివర్మ, జిల్లా కమిటీ సభ్యులు యు. గౌతమ్ కుమార్, సీనియర్ న్యాయవాది ఎం. కిషోర్, న్యాయవాదులు ఎ. అంజలి కుమారి, శివకృష్ణ, కోరాడ శ్రీనివాసరావు, విజ్జగిరి రవితేజ, సౌజన్య, పి. మధుబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# పితృస్వామ్యానికి, వాతావరణ మార్పులకు సంబంధం ఉంది



బాలీవుడ్ నటి దియా మీర్జా (Dia Mirza) వాతావరణ సంక్షోభంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. పితృస్వామ్యానికి, వాతావరణ మార్పులకు సంబంధం ఉందని తాను చేసిన వ్యాఖ్యలను దియా మీర్జా సమర్థించుకున్నారు. ఇటీవల సోహా అలీఖాన్ 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో దియా మాట్లాడారు. ఫొటోగ్రాఫర్ ఆరతికుమార్ రావుతో కలిసి ఎకోఫెమినిజంపై ఆమె చర్చించారు.

'వాతావరణ మార్పు కేవలం పర్యావరణ సమస్య కాదు. ఇది అసమానతల సమస్య కూడా. ఏళ్లుగా పురుషాధిక్య వ్యవస్థలు ప్రకృతిని దోచుకున్నాయి. శతాబ్దాలుగా, పితృస్వామ్య వ్యవస్థలు అధికారాన్ని చేపట్టాయి. సంరక్షణ కంటే దోపిడీకే ప్రాధాన్యమిచ్చి, ప్రకృతిని, బలహీన వర్గాలను దోపిడీకి గురయ్యే వనరులుగా చూశాయి. ఇది పితృస్వామ్య సమాజంలో మహిళలు, బాలికలను చూసే విధానం లాంటిదే' అని ఆమె అన్నారు. 'స్త్రీలను చూసినట్లే అడవులు, నదులను వస్తువుల్లా చూశాయి. వరదలు, కరవు వస్తే మొదట ఇబ్బందిపడేది ఆడవాళ్లు, పిల్లలే. కానీ నిర్ణయాలు తీసుకోవడంలో వారికి చోటు లేదు. ఆధిపత్యం పోయి, కరుణ, సమానత్వం ఉంటేనే పరిష్కారం దొరుకుతుంది' అని ఆమె తేల్చి చెప్పారు.

# చీరలో ఫైట్లు చేయడం.. చాలా కష్టమైంది



'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకులు దేవా కట్టా, డీకే, రాహుల్ రవీంద్రన్, నిర్మాతలు డి.సురేశ్‌బాబు, వై రవిశంకర్, స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ.. "ఈ సినిమాతో కచ్చితంగా ఒకొక్కర్ని ప్రేమతో కొడతా. దీన్ని మేమంతా చాలా ప్రేమతో చేశాం. ఇప్పటి వరకు నటిగా నా కెరీర్ చాలా సాఫీగా సాగిపోయింది. కానీ, నటిగా, నిర్మాతగా ఉండటంలో ఉన్న కష్టమేంటన్నది నాలుగైదు రోజులుగా అర్థమవుతోంది. సమష్టి కృషి వల్లే ఈ చిత్రం సాధ్యమైంది. ఈ సినిమాలో నేను చాలా సహజంగా నటించానంటే దానికి ప్రధాన కారణం దీంట్లో ఉన్న సంభాషణలే. ఇందులో నేను చీరలో ఫైట్లు చేశాను. చాలా కష్టంగా అనిపించింది. దీంట్లో యాక్షన్ సన్నివేశాలన్నీ అలరిస్తాయి. ఈ సినిమాలో ప్రతిఒక్కరూ అద్భుతంగా నటించారు" అన్నారు.

"నా జీవితంలో ఈ సినిమాకి పడినంత కష్టం ఏ చిత్రానికి పడలేదు. సమష్టి కృషితో దీన్ని ఆరు నెలల్లో పూర్తి చేయగలిగాం. సమంత, రాజ్ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని నమ్ముతున్నా. ఈ నెల 19న మీకు నచ్చిన సామ్‌ని పది రెట్లు గొప్పగా తెరపై చూస్తారు" అన్నారు దర్శకురాలు నందినీ రెడ్డి. ఈ కార్యక్రమంలో చిన్మయి, దిగంత్, ఆనంద్, హిమాంక్, శ్రీలక్ష్మి, గవిరెడ్డి, పానీ వర్మ తదితరులు పాల్గొన్నారు.



# ఆ రోజుల్లోనూ విమర్శలు ఉండేవి కానీ..!

90ల కాలంలో కూడా విమర్శలు ఉండేవి.. కానీ అప్పట్లో సోషల్ మీడియా లేకపోవడం వల్ల అవి మా వరకు వచ్చేవి కావని అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక మాధురీ దీక్షిత్. ఇటీవలే 'మా బెహన్'తో ప్రేక్షకుల్ని పలకరించిందీమె. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తన కెరీర్ ప్రారంభంలో ఎదురైన విమర్శల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "సినీరంగంలో నటీమణులు ఎక్కువ విమర్శలకు గురవుతారు. 1980లో చిత్ర పరిశ్రమకు వచ్చినప్పుడు నేను కూడా ఇలాంటివే ఎదుర్కొన్నాను. అప్పుడు నేను చాలా సన్నగా ఉన్నానని.. 'ఈమెకు ఏదైనా తినిపించండి' అనేవారు. ఇక్కడ బరువు పెరిగినా ట్రోల్ చేస్తారు.. సన్నగా అయినా విమర్శిస్తారు. అప్పట్లో సోషల్ మీడియా, ట్రోలింగ్ సంస్కృతి లేకపోవడంతో ఇలాంటి వ్యాఖ్యలను ఎదుర్కోవడం చాలా సులభమైంది. నా దృష్టిలో వీటన్నింటినీ తేలికగానే తీసుకోవాలి. మరీ ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వకూడద"ని చెప్పుకొచ్చింది మాధురి.

# మరో వివాదంలో విష్ణుప్రియ.. ఐదుగురితో సెక్స్ చేశానంటూ నెట్టింట బోల్డ్ వీడియో

టాలీవుడ్ యాంకర్ విష్ణు ప్రియ పలు టీవీ షోల్లో తన గ్లామర్, చలాకీ తనంతో అందరినీ మెప్పించారు. పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి ఫేమ్ పాపులారిటీ రాబట్టుకున్నారు. పలు టీవీ షోల్లో యాంకర్‌గా వ్యవహరించడంతో పాటు సోషల్ మీడియాలో తన బోల్డ్ ఫొటోలు షేర్ చేస్తూ అందరినీ ఆశ్చర్య పరచడంతో పాటు చిక్కుల్లో పడుతోంది. ఇటీవల ఒక ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ యాప్ ద్వారా డబ్బులు సంపాదించే క్రమంలో ఆమె కొన్ని బోల్డ్ వీడియోలను షేర్ చేయడంతో నెట్టింట తీవ్ర విమర్శలు వచ్చాయి. సామాజిక బాధ్యత మరిచి అర్ధనగ్న ఫొటోలు, వీడియోలు పెడుతోందంటూ ఏఐఎస్ఎఫ్ (AISF) నాయకులు ఆమెపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ వివాదం ఇంకా పూర్తిగా ముగియకముందే, యాంకర్ విష్ణుప్రియ తాజాగా మరో కొత్త చిక్కుల్లో పడ్డారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించడానికి ఆమె ఒక లైవ్ క్యూ అండ్ ఏ సెషన్‌ను నిర్వహించారు. ఈ లైవ్ సెషన్‌లో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇస్తూ వచ్చారు.

అయితే, ఈ క్రమంలో ఒక నెటిజన్ విష్ణుప్రియను ఉద్దేశించి 'మీ బాడీ కౌంట్ ఎంత?' (అంటే ఇప్పటివరకు ఎంతమందితో శృంగారంలో పాల్గొన్నారు?) అంటూ బోల్డ్ ప్రశ్నను అడిగారు. సాధారణంగా సెలబ్రిటీలు ఇటువంటి అసభ్యకరమైన లేదా వ్యక్తిగత ప్రశ్నలు ఎదురైనప్పుడు వాటిని స్కిప్ చేస్తారు లేదా సదరు నెటిజన్‌పై మండిపడతారు. కానీ విష్ణుప్రియ మాత్రం అస్సలు వెనకడుగు వేయకుండా, ఎంతో ఓపెన్‌గా సమాధానం ఇచ్చి అందరినీ షాక్‌కు గురి చేశారు. తాను ఇప్పటివరకు ఐదుగురితో సెక్స్ చేసినట్లు ఆమె ఏమాత్రం మొహమాటం లేకుండా లైవ్‌లోనే సమాధానం ఇచ్చారు. అంతేకాకుండా బోల్డ్ డ్రెస్‌లో ఎద అందాలు జూమ్ చేసి చూపిస్తూ రెచ్చిపోయారు. ఇక విష్ణు ప్రియ ఇచ్చిన ఈ బోల్డ్ ఆన్సర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విష్ణుప్రియ అంత బహిరంగంగా తన వ్యక్తిగత విషయాలను పంచుకోవడాన్ని కొందరు నెటిజన్లు తప్పపడుతున్నారు. ఇలాంటి విషయాలను లైవ్‌లో మాట్లాడటం ఏంటని నెటిజన్లు ఆమెపై దారుణంగా ట్రోల్స్ చేస్తున్నారు. విష్ణుప్రియ చేసిన ఈ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.




# రాజకీయాల్లోకి రాబోతున్న మరో హీరో.. నా దృష్టంతా ప్రజాసేవపైనే పెడతానంటూ కామెంట్స్



కోలీవుడ్ ఇండస్ట్రీలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ రాజకీయాల్లోకి వచ్చి, ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన తర్వాత తమిళ ఇండస్ట్రీలో పొలిటికల్ హీట్ బాగా పెరిగింది. స్టార్ హీరోలు ఓ వైపు వరుస సినిమాలు చేస్తూనే మరోవైపు రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారు. విజయ్ సాధించిన విజయం ఇచ్చిన స్ఫూర్తితో కోలీవుడ్ హీరోలు ఒక్కొరొక్కరిగా రాజకీయాల్లోకి వస్తున్నారు. ఇప్పటికే రాఘవ లారెన్స్ పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇస్తూ ప్రకటన చేయగా.. ఎప్పుడనే విషయాన్ని మాత్రం సస్పెన్స్‌లో ఉంచారు. ఇక ఇప్పుడు మరో హీరో రాజకీయాల్లో రాబోతున్నట్లు హింట్ ఇచ్చాడు. నటుడిగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న జీవీ ప్రకాష్ కుమార్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారితీస్తున్నాయి.

తన సినీ ప్రయాణం ఇంకొక పదిహేను, పదహారేళ్లు కొనసాగుతుందో లేదో తాను ఖచ్చితంగా చెప్పలేనని జీవీ ప్రకాష్ అన్నారు. కానీ, ఆ తర్వాత మాత్రం తన దృష్టిని పూర్తిగా ప్రజాసేవపైనే పెడతానని స్పష్టం చేశారు. సమాజంలో మార్పు కోసం, ప్రజలకు సేవ చేయడానికి భవిష్యత్తులో ఏదైనా చేస్తానని చెప్పారు. తన ఆలోచనలకు, ఆశయాలకు సరిపోయే ఒక మంచి వేదిక దొరికితే.. వారితో కలిసి పనిచేయడానికి తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానని తెలిపారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. విజయ్ పార్టీలో చేరతారని అంతా చర్చించుకుంటున్నారు. కోలీవుడ్ ఇండస్ట్రీకి చెందిన హీరోలంతా సినిమాకంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంపై నెటిజన్లు రకరకాల కామెంట్లు పెడుతున్నారు.

# మలయాళ ఇండస్ట్రీకి కరణ్ జోహార్ ఎంట్రీ.. గర్వంగా ఉందంటూ ఎమోషనల్ పోస్ట్



బాలీవుడ్ స్టార్ నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్, మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్‌కు చెందిన పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ మలయాళ చిత్రాన్ని ప్రకటించాయి. 19వ శతాబ్దపు కేరళ జానపద కథలు, సాంస్కృతిక గాథల ఆధారంగా 'ఓడియన్: ది ఏజ్ ఆఫ్ ఇల్యూజన్' పేరుతో రాబోతుంది. తాజాగా, ఈ ప్రాజెక్ట్ గురించి కరణ్ జోహార్ సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తాము ధర్మ ప్రొడక్షన్స్ తరఫున మలయాళ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నందుకు చాలా గర్వంగా ఉందని తెలిపారు. పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్‌తో తమకు ఇప్పటికే ఎన్నో విజయవంతమైన కొల్లాబరేషన్స్ ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయబోతున్నామని చెప్పారు. ఈ తరం సినిమాలో జానపద కథలను ఎంతో భయంకరంగా, ఆసక్తికరంగా తెరకెక్కించడంలో దర్శకుడు రాహుల్ సదాశివన్‌కు ఒక ప్రత్యేకమైన శైలి ఉందని కరణ్ జోహార్ ప్రశంసించారు.

ఈ బలమైన జానపద ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించడానికి అద్భుతమైన నటి మంజు వారియర్, తమకు ఎంతో ఇష్టమైన పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారని, ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుందని ఆయన వెల్లడించారు. అయితే ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న మొట్టమొదటి మలయాళ చిత్రం ఇదే కావడం విశేషం. కేరళ పురాణాల్లోని రూపం మార్చుకునే ఓ మాయా శక్తి, ఒక బలమైన మాతృస్వామ్య కుటుంబంపై విరుచుకుపడటం.. ఆ తర్వాత సత్యం, భ్రమల మధ్య జరిగే భీకర పోరాటం చుట్టూ ఈ కథ సాగనుందని టాక్. కేరళ జానపద కథలను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించే దర్శకుడు రాహుల్ సదాశివన్ ఈ సినిమాను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తుండగా.. మంజు వారియర్, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ కూడా ప్రారంభం కానుందని సమాచారం.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500171. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502517.